

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 12 | సంచిక : 4 | డిసెంబరు 2006

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 32

గౌరవ సంపాదకులు

శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రు॥100/-

విడి ప్రతి : రు॥ 5/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు - 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు - 534 265

☎ 08814 - 224747

9247104551

ఈ సంచికలో....

జిన్నూరు............ 01-10-06

నరసాపురం ...... 03-10-06

కువైట్ ............... 18-10-06

తణుకు .............. 19-11-06

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747



కత్తార్‌లో సద్గురు శ్రీ నాన్నగారు

Visit us @ www.srinannagaru.com

# సద్గురువు భగవాన్ శ్రీ రమణ మహర్షి

అనంతము, అద్వితీయము, ఉపాధిరహితము, జనన మరణముల కతీతమైన శుద్ధ చైతన్యానికి రాక, పోకలు లేవు. అట్టి బ్రహ్మమే జీవకోటిని అంతిమ సత్యంలోనికి మేల్కొలుపుటకు, ఒక మానవ రూపు దాల్చి భగవాన్ శ్రీ రమణ మహర్షిగా ది. 30-12-1879 నుండి 14-04-1950 వరకు గల మధ్యకాలంలో భూమిని సందర్శించుట జరిగినది. భగవాన్ శ్రీ రమణ మహర్షి వారి జీవిత కాలంలో ఏబది నాలుగు సంవత్సరములు అరుణాచలంలో అతిసామాన్యునిగా జీవించి, సకల జీవకోటికి రక్షకుడిగా, ఆశ్రయంగా, ఒక బలీయమైన 'పరమశాంతి' కేంద్రంగా నిలిచారు. ఆయన దృక్పథం సమగ్రం. స్వానుభవం ద్వారా ఆర్జించుకొన్న అఖండాద్వైతస్థితి నుండి పెల్లుబికే పరమశాంతిని దివ్యజ్ఞాన ఔషధముగా పంచి మానవాళి పరమగమ్యమైన 'స్వరూప ఎరుక'లో మేల్కొలుపుటకు వారి సహాయాన్ని నిరంతరంగా అందిస్తూనే ఉన్నారు. వారి దివ్యతత్త్వ బోధ దేశకాలముల కతీతమైన నిరంతర జ్ఞాన ప్రవాహము. సహృదయంతో నిష్కపటంగా ప్రయత్నం చేస్తే భగవాన్ అనుగ్రహం ద్వారా ఆయన బోధలోని మర్మం అవగతమైతీరుతుంది. అట్టి మహాగురువు ఋణం తీర్చుకోవాలంటే వారి బోధలను ఆచరణలో పెట్టి అహంభావనను నిశ్శేషంగా త్యజించటం ద్వారా మన సహజస్థితిని అనుభవైకవేద్యం చేసుకొని కృతార్థులం కావాలి.

**- చావలి సూర్యనారాయణమూర్తి**

టీచర్, అమలాపురం

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 01-10-06, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఇప్పుడు మనందరికి ఆనందంకావాలి కాని ఆనందం ఎవరికి దొరకటం లేదు. డబ్బు ఉన్నవారికి ఆనందంలేదు, డబ్బులేనివారికి ఆనందం లేదు, అధికారం ఉన్నవారు ఆనందంగా లేరు, అధికారం లేనివారు ఆనందంగా లేరు, చదువు ఉన్నవారు ఆనందంగా లేరు, చదువు లేనివారు ఆనందంగా లేరు. దొంగ నేనే చదువులన్నీ నేర్చుకొంటుంది, దానిమీద మన పొట్ట వెళ్ళిపోతుంది. దొంగ నేనుకు వచ్చే సంతోషం ఎంతకాలం ఉంటుంది, దొంగ నేనుకు వచ్చే దుఃఖం ఎంతకాలం ఉంటుంది. దొంగనేను నేర్చుకొనే చదువులు ఎంతకాలం ఉంటాయి.

దొంగ నేనుకు వచ్చేది ఏదీ నిజంకాదు. నిజంకానిది ఏదీ శాశ్వతంగా ఉండదు. ఆనందం, శాంతి అనేవి ఈ సృష్టిలో బయట ఎక్కడా లేవు. ఎక్కడో ఉన్నాయి, ఎక్కడో ఉన్నాయి అనుకొంటాము, ఇలా వెతకటంతోటే మనకు కొన్నివేల జన్మలు గడిచిపోతున్నాయి. కొంతకాలం చదువులో ఆనందం ఉంది అనుకొంటాము, కొంతకాలం డబ్బులో ఉంది అనుకొంటాము, కొంతకాలం అధికారంలో ఉంది అనుకొంటాము, కొంతకాలం గౌరవంలో ఉంది అనుకొంటాము కాని ప్రపంచంలో ఏ వస్తువులోను ఆనందం లేదు. ఆనందం అనేది మన హృదయంలోనే ఉంది, అది మనం గ్రహించాలి. అది గ్రహించినా ఆనందం మనకు అందదు. మనకు చిత్తశుద్ధి కలగాలి. చిత్తశుద్ధి కలిగితేనేగాని చిత్తం అంతర్ముఖం అవ్వదు. మనస్సు అంతర్ముఖం అయితేనేగాని లోపల హృదయంలో ఉన్న ఆనందం మనకు అందదు. హృదయంలో ఉన్న ఆనందం అందితేనేగాని మనం జననమరణచక్రంలోనుండి బయటకు రాలేము. మన హృదయంలో ఉన్న ఆనందం నూటికి నూరుపాళ్ళు మనకు అనుభవంలోనికి వచ్చింది అనుకోండి ఇంక మనం సుఖం కోసం, ఆనందం కోసం బజారులో వెతుక్కోము, ఇంక మనకు శరీరాలు రావు. ఈ జన్మలో సుఖంగా లేము, పోనీ వచ్చేజన్మలో అయినా సుఖంగా ఉంటామేమో అని కొంతమంది అంటూ ఉంటారు. ఈ జన్మ ఎంత అబద్ధమో వచ్చే జన్మ కూడా అంతే అబద్ధం. ఈ జన్మలన్నీ దొంగనేనుకే, అందుచేత మీరు సబ్జక్టును బాగా అర్థం చేసుకోండి.

ఇప్పుడు మనందరము మోక్షంలోనే ఉన్నాము కాని మోక్షంలో లేము అనుకొంటున్నాము. ఏ కారణం వలన మోక్షంలో లేము అనుకొంటున్నామో ఆ కారణాన్ని తొలగిస్తే ఇక్కడ కూర్చొన్న వాళ్ళము నిలబడనక్కరలేదు, కాళ్ళు కదపనక్కరలేదు, చేతులు కదపనక్కరలేదు ఈ క్షణంలోనే మీకు నూటికి నూరుపాళ్ళు ఆనందం, మోక్షసుఖం వచ్చేస్తుంది. ఇదేమీ ఒక పార్టీకాదు, జనాన్ని పోగు చేసుకోవటానికి చెప్పే మాటలు కాదు. ఇక్కడ లక్షమంది ఉన్నా, ఒక్కరు ఉన్నా ఒక్కటే. మేము చెప్పేమాటల వలన కనీసం ఒక్కరికి శాంతి దొరికితే మా జీవితం ధన్యం. శరీరానికి అనారోగ్యం వస్తుంది, మనస్సుకు అశాంతి వస్తుంది. కాని మన హృదయంలో ఉన్న నిజానికి అనారోగ్యం లేదు, అశాంతి లేదు. అబద్ధానికి అశాంతి వస్తుంది కాని నిజానికి అశాంతి రాదు. మనం మోక్షంలోనే ఉన్నాము కాని మోక్షం కోసం వెతుకుచున్నాము. ఇదే మాయ. మీకు అందరికి భక్తి ఉంది, భక్తి లేదు అని నేను చెప్పటం లేదు. కోరికలతో సంబంధం లేకుండా మనకు భక్తి ఉంటే, ఆ భక్తి మన మనస్సు అంతర్ముఖం

అవ్వటానికి సహకరిస్తుంది. మనం గుడికి వెళ్ళి ఏవో కోరికలు అడుగుతాము. అంటే మనం దేవుడిని అబద్దాలు అడుగుతున్నాము కాని నిజాన్ని అడగటం లేదు. మనందరము మోక్షంలోనే ఉన్నాము, మోక్షంలోనే ఉన్నాము అని మనకు తెలియకపోవటం వలన దుఃఖం వస్తోంది, అశాంతి వస్తోంది, పునర్జన్మలు వస్తున్నాయి. ఈ దేహమే నేను, ఈ మనస్సే నేను అనే బుద్ధి మనకు ఉంది. దీనివలన మన హృదయంలో ఉన్న ఐశ్వర్యం మన చేతికి అందటంలేదు. మిమ్మల్ని ఎవరైనా పొగిడితే ఒకరకంగా ఉంటారు, విమర్శిస్తే ఒకరకంగా ఉంటారు, మీ శరీరానికి రోగం వస్తే ఒకరకంగా ఉంటారు, ఆరోగ్యంగా ఉంటే ఒకరకంగా ఉంటారు, ఇలా రకరకాలుగా ఉంటారు. ఈ దేహమే నేను అనుకోవటం వలన దేహం చనిపోయినప్పుడు నేను చనిపోతున్నాను అనుకొంటావు. దేహము చనిపోయినప్పుడు నువ్వు చనిపోవు. మనస్సు నువ్వు అనుకోవటం వలన నీకు అశాంతి వస్తోంది, దుఃఖం వస్తోంది, మనస్సు నువ్వు కాదు. దేహము పట్ల నేను అనే బుద్ధి, మనస్సుపట్ల నేను అనే బుద్ధి ఈ రెండింటిని సాధన చేసి తొలగించుకొంటే ఇక్కడ నుండి కదలనక్కరలేకుండా, నేను చెప్పే ఈ మాటలతో కూడా సంబంధం లేకుండా, ఈ గుమ్మందాటి బయటకు వెళ్ళనక్కరలేకుండా ఇక్కడే, ఇప్పడే మోక్ష సుఖాన్ని అందుకొంటారు.

ఈ దేహమే నేను, ఈ మనస్సే నేను అనే బుద్ధి మనకు ఉంది, ఈ అలవాటు అనేక జన్మలనుండి వస్తోంది. అందుచేత ఈ అలవాటులో నుండి మనం బయటకు రాలేకపోతున్నాము. ఈ అలవాటులోనుండి బయటకు రావాలంటే మనకు భక్తి ఉండాలి, ప్రేమ ఉండాలి, ఈశ్వరునిపట్ల శరణాగతిభావన ఉండాలి, సజ్జనసాంగత్యం ఉండాలి, అవకాశం ఉన్నప్పుడు పుణ్యక్షేత్రాలు దర్శించాలి, మంచిమాటలు వినాలి, మంచిగ్రంథాలు అధ్యయనం చేయాలి, ఇలా ఇవిఅన్నీ సమన్వయం చేసుకొంటూ ఉంటే ఈ దేహము నేను అనే బుద్ధి, మనస్సు నేను అనే బుద్ధి నెమ్మదిగా పల్చబడి నశిస్తుంది కాని లేకపోతే ఇది నశించదు. ఒక వ్యక్తి ఎంత ధనవంతుడైనా, విద్యావంతుడైనా, వాడికి ఎన్నిఉన్నా వాడికి దేహాత్మబుద్ధి కనుక ఉంటే వాడికి జ్ఞానం లేదని అర్థం. దేహాభిమానం లేనివాడే జ్ఞాని. ఆత్మ జ్ఞానమే మోక్షం. ఆత్మజ్ఞానం సంపాదించకపోతే దుఃఖసముద్రంలో నుండి బయటకు రాలేవు, జనన మరణ చక్రంలో నుండి విడుదల పొందలేవు. మీ మనస్సులో ఎవరికైనా అశాంతిగా ఉంది అనుకోండి, నేను చెప్పే మాటల యొక్క బరువు మీకు తెలియదు. మీ మనస్సు నిర్మలంగా ఉంటే, మీ బుద్ధి మంచిది అయితే కదా ఈ మాటల యొక్క తూకం మీకు తెలిసేది. ఈ బంగారం

మంచిదా, చెడ్డదా అని రోడ్డు మీద పోయేవాడిని అడిగితే వాడు చెప్పలేడు, బంగారాన్ని పరిశీలించేవాడిని అడిగితే చెపుతాడు. అలాగే ప్రోపర్ అండర్‌స్టాండింగ్ వలన మీకు ఎంత దుఃఖం ఉన్నా ఆ దుఃఖం అంతా సుఖంగా మారిపోతుంది. ఈ సబ్జక్టు మీకు బాగా అర్థమవుతూ ఉంటే మీ జీవితంలో ఎన్నడూ అనుభవించనటువంటి శాంతి ఇప్పుడు ఈ క్షణంలో మీకు వస్తుంది.

దేహంపట్ల అహంబుద్ధి, మనస్సుపట్ల అహంబుద్ధి ఉంటే అది బంధం, దేహంపట్ల అహంబుద్ధి లేదనుకోండి, మనస్సుపట్ల అహంబుద్ధి లేదనుకోండి అది మోక్షం. ఆత్మలోనుండి మనం ఎప్పుడు వేరుపడిపోయామో మనకు తెలియదు, ఆత్మకంటే భిన్నంగా మనకు నేను వ్యక్తమవుతోంది, ఆ నేనే జీవుడు. మనందరం నేను, నేను అంటాము. భగవంతుడున్నాడు అని చెప్పేవాడు నేను అంటాడు, భగవంతుడు లేడు అని చెప్పేవాడు నేను అంటాడు. ఆ నేను వచ్చాక మనస్సు వస్తోంది, మనస్సు వచ్చాక శరీరం వస్తోంది, శరీరం వచ్చాక లోకం వస్తోంది, అక్కడ నుండి విషయాలు, బంధం. ఏ నేను వచ్చిన తరువాత అన్నీ వస్తున్నాయో అక్కడ ఆగి, ఆ నేనును అది ఎక్కడ ఉదయించి వస్తోందో అక్కడకు పంపగలిగితే జన్మరాహిత్య స్థితిని పొందుతావు. మనకు ఆత్మజ్ఞానం పట్ల శ్రద్ధ లేదు, ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడని విశ్వాసం లేదు. భగవంతుడు ఉంటే మనకు కనబడాలి కదా అంటాము. మనం ఏదైనా పని చేయాలి అంటే శరీరం ఉండాలి. ఈశ్వరుడు అంటే ఈ సృష్టికి యజమాని. ఆయనకు దేహంతో పనిలేదు. దేహం లేకుండా పని చేయగలడు. నీ కళ్ళకు కనబడటం లేదు అంటే ఆయనను తెలుసుకోవటానికి నీ మనస్సు ఎంత? నీ కళ్ళు ఎంత? నీ అహంకారం ఎంత? మనం ఎటువంటి వారమో ఒకసారి రామకృష్ణుడు చెప్పారు. ఒక ఎలుకకు ఒకసారి రూపాయి కాగితం దొరికింది అట. వెంటనే ఆ రూపాయి కాగితాన్ని పట్టుకొనిపోయి, తన కన్నంలో దాచుకొని నేను ధనవంతురాలిని అయిపోయాను అనుకొంది. బయటకు మేతకోసం వస్తోంది కాని ఆ రూపాయి కాగితాన్ని బయటకు తేవటం లేదు, జాగ్రత్తగా లోపల దాచేసుకొంది. ఆ రూపాయి లేనప్పుడు సుఖంగా ఉంది, రూపాయి వచ్చాక నేను ధనవంతురాలిని అని గర్వం పెరిగిపోయింది, పొగరుబోతుతనం వచ్చేసింది, నా అంత ధనం ఏ ఎలుకకు ఉంది అంటోంది, ఇంతా చేస్తే ఆ కన్నంలో ఉన్నది ఒక రూపాయే. ఈ లోపు ఆ దారిన ఒక ఏనుగు వెళుతోంది, దాని కాలు ఆ కన్నం మీద పడింది, అక్కడ కన్నం ఉన్నట్లు దానికి తెలియదు, మామూలుగా వెళ్ళిపోతోంది. ఏనుగు కాలు కన్నం మీద పడటం ఎలుక

చూసింది. నేను ధనవంతురాలిని, నా కన్నం మీద నుండి నీవు నడిచి వెళతావా అని ఎలుకకు సడన్‌గా కోపం వచ్చేసింది. ఆ ఏనుగు వెళ్ళిపోతోంది. ఈ ఎలుక కోపంగా వెనకాల వెళ్ళి చావు అని ఏనుగును ఒక్క తన్ను తన్నిందట. ఎలుక తన్నితే ఏనుగు చనిపోతుందా? ఏనుగు చాలా పెద్ద జంతువు, దానిని నీ లెక్కంత అంటోంది ఎలుక, రూపాయి కాగితం వచ్చాక వచ్చిన గర్వం అలా అనిపిస్తోంది, మనందరం ఇలా తయారయ్యాము అని రామకృష్ణుడు చెప్పారు. విద్య వలన, ధనం వలన, అధికారం వలన వచ్చే గర్వం నిగ్రహించుకోవటం చాలా కష్టం. ఎంతో నిగ్రహం ఉంటేనేగాని వాటిని కంట్రోలు చేసుకోలేము.

సూర్యుడు, అగ్ని, గురువు వీటిలో భగవంతుడి యొక్క అంశ ఉంది అని చెపుతారు. వీరిలో ఎవరిని ఆరాధించినా మీకు కొంత శక్తి కలుగుతుంది, శాంతి కలుగుతుంది. మీకు ఇష్టమైన భగవంతుడి యొక్క రూపాన్ని ధ్యానించటం వలన, ఆ నామాన్ని స్మరించటం వలన మనస్సు యొక్క చాపల్యం తగ్గుతుంది, కొంత శాంతిగా ఉంటుంది. మరల మీకు అశాంతి వచ్చేస్తుంది. రూపధ్యానం, నామజపం మంచిదే. వీటి వలన మీ మనస్సు తాత్కాలికంగా నిర్మలంగా ఉంటుంది. మరల విజృంభిస్తుంది. మీ మనస్సు అనే సమస్య పరిష్కారం అయ్యే వరకు అశాంతి, దుఃఖం మిమ్మల్ని విడిచిపెట్టవు. అందుచేత మేమేదో ఒక గంట సేపు జపం చేస్తున్నాను, ఒక గంటసేపు ధ్యానం చేస్తున్నాను, నాకు మోక్షం వచ్చేస్తుంది అని అనుకోవద్దు, అలా రాదు. దేహం పట్ల అహంబుద్ధి, మనస్సు పట్ల అహంబుద్ధి ఉన్నంతకాలం మీకు మోక్షం వచ్చే సమస్య లేదు. నేను అది సాధించాను, నేను ఇది సాధించాను అనుకొంటున్నారు, అలా ఎవరు అనుకొంటున్నారు, నీ మనస్సు అనుకొంటోంది, అదంతా పెంట పెంచుకోవటం, రాబోయే జన్మలకు బీజాలు పెంచుకోవటం. అజ్ఞానం నశించదు అనుకోండి ఈ జన్మలో మీకు ఎంత అశాంతి వుందో రాబోయే జన్మలలో కూడా అంతే అశాంతి వస్తుంది, బహుశా ఇంకా వడ్డీతో సహా రావచ్చు. అజ్ఞానం నశించకుండా అశాంతి నశించదు. మన హృదయంలో ఉన్న ఆనందం అందే వరకూ మనస్సు యొక్క చాపల్యం ఆగదు. దుఃఖ సముద్రంలో నుండి, అశాంతి సముద్రంలోనుండి బయటపడాలంటే ఆత్మజ్ఞానం సంపాదించటం తప్పించి ఇంకో మార్గం లేదు. మీకు ఎప్పుడైనా అశాంతి వస్తోంది అనుకోండి, భయం వస్తోంది అనుకోండి, కంగారు పడవద్దు. అవి వస్తే రానివ్వండి. ఏమిటి ఇంత దుఃఖం వస్తోంది, ఏమిటి ఇంత భయం వస్తోంది అని మనస్సు చేత మనస్సును విచారణ

చెయ్యండి. భయం వచ్చినా, దుఃఖం వచ్చినా, అశాంతి వచ్చినా కంగారు పడవద్దు. అవి ఎక్కువగా రావటం వలన ఎందుకు ఇంత భయం వస్తోంది, ఎందుకు ఇంత దుఃఖం వస్తోంది అని ఆలోచన ప్రారంభమవుతుంది. ఆ ఆలోచనలో, ఆ వేగంలో మీ మనస్సు అంతర్ముఖం అవుతుంది. అంటే మీ అశాంతి, మీ దుఃఖం మీ మనస్సును అంతర్ముఖం చేయవచ్చు. మనస్సు అంతర్ముఖం అవ్వటం వలన ఆత్మజ్ఞానం కలుగుతుంది. నీ మనస్సు అటు ఇటు చలిస్తూ ఉంటే దానికి దేహాభిమానం కారణం. దేహాభిమానం లేకపోతే మనస్సుకు చాపల్యం రాదు.

కాళ్లకూరులో ఒక డాక్టరుగారు నాకు చెప్పారు నేను అమెరికా వెళ్లి డబ్బు సంపాదించి కాళ్లకూరుకు ఎన్నో ఉపకారాలు చేసాను. కాళ్లకూరుకు ఉపకారాలు చేయకముందు నాకు ఎవరూ విరోధులు లేరు, నా సొంత డబ్బు ఖర్చు పెట్టి ఇక్కడ ఉపకారాలు చేసాక నాకు విరోధులు వచ్చారు" అని చెపుతున్నారు. 'దానినే ప్రపంచం అంటారు' అని ఆ డాక్టరుగారికి చెప్పాను. ఆ డాక్టరుగారికి ఇంకొకటి చెప్పాను కాళ్లకూరులో విరోధులు ఉన్నారు అని కంగారు పడవద్దు. నాకు విరోధులు ఉన్నారు అని ఎవరు అంటున్నారు? మీ మనస్సే అంటోంది. ఆ మనస్సును ఓవర్‌కమ్ చేయండి, విరోధులు ఉన్నా ఇబ్బంది లేదు. మనం చెప్పలు వేసుకొని వెళితే రోడ్డుమీద ముళ్ళు ఉన్నా ఇబ్బంది లేదు. మీరు మనస్సును జయిస్తే విరోధులు ఉన్నా నష్టం లేదు, స్నేహితులు ఉన్నా లాభం లేదు. విరోధులు ఎక్కడ ఉన్నారు మనస్సులో ఉన్నారు; స్నేహితులు ఎక్కడ ఉన్నారు, మనస్సులో ఉన్నారు. మనస్సు లేకపోతే విరోధులు లేరు, స్నేహితులు లేరు. ఇదంతా మీరు మనస్సును జయించటానికి భగవంతుడు చేసిన పన్నాగం అని చెప్పాను. నువ్వు కోరుకొనే సుఖంగాని, శాంతిగాని, ఆనందంగాని ప్రపంచంలో ఎక్కడాలేవు, ఇది ముందు నీకు తెలియాలి. గురువు అనుగ్రహం లేకుండా ఇది నీకు అర్థం కాదు. ప్రపంచంలో ఎక్కడా ఏమీ లేదు అని నీకు అర్థమైతే అప్పడు మనస్సుకు లోచూపు కలుగుతుంది. అంతర్ముఖం అయిన మనస్సుకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. భగవంతుడు చెప్పిన మాటలను ప్రమాణంగా పెట్టుకొని జీవిస్తూ ఉంటే భగవాన్‌కు అరుణాచలేశ్వరుడు ఎలా స్ఫురించాడో అలాగ మనకు కూడా స్ఫురిస్తాడు అయితే మనం చేసే పని శ్రద్ధగా చేయాలి, ప్రేమగా చేయాలి. మీకు ఒక మామిడి పండు ఇచ్చాను అనుకోండి. అది ప్రేమగా ఇవ్వకపోతే అది మిమ్మల్ని సుఖపెట్టదు, నన్ను సుఖపెట్టదు. ఐన్‌స్టీన్ ఎంత ప్రేమగా పని చేసేవాడో ఒక చిన్న విషయం చెపుతాను. ఐన్‌స్టీన్ ఒక కాలేజీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన ఇంటి

ప్రక్కన మూడవ తరగతి చదివే అమ్మాయి ఉంది. ఐన్‌స్టీన్ ఎంత పెద్దవాడో ఆ అమ్మాయికి తెలియదు. ఆ అమ్మాయి ఐన్‌స్టీన్ దగ్గరకు వచ్చి నాకు లెక్కలు చెపుతారా అని అడిగింది. ఆ అమ్మాయి అమాయకత్వంగా అడగటం చూసి ఐన్‌స్టీన్‌కు సంతోషం కలిగింది. నీకు లెక్కలు చెపుతాను మరి నాకు జీతం ఎంత ఇస్తావు అని ఐన్‌స్టీన్ అడిగాడు. మూడవ తరగతి చదివే అమ్మాయి ఏమి ఇస్తుంది, సంపాదన లేదు కదా. అమ్మాయి ఒకసారి ఆలోచించి మా నాన్న నాకు వారానికి ఒక డాలర్ ఇస్తాడు. అందులో నేను 25 సెంట్లు ఉంచుకొని, 75 సెంట్లు మీకు ఇస్తాను అని చెప్పింది. ఎంత గొప్ప త్యాగం అనుకొన్నాడు ఐన్‌స్టీన్, నీకు లెక్కలు చెపుతాను అన్నాడు. సరిగ్గా వారం అయ్యేసరికి అమ్మాయి 75 సెంట్లు తెచ్చి ఇచ్చింది, ఐన్‌స్టీన్ ప్రేమగా తీసుకొని పర్సులో దాచుకొనేవాడు. ఇలా రెండు నెలలు గడిచాయి. ఆ అమ్మాయి తండ్రి కూడా లెక్చరర్. ఆ అమ్మాయి తల్లి ఏమండీ మన అమ్మాయి రోజూ ఐన్‌స్టీన్ గారి ఇంటికి వెళుతోంది అని చెప్పింది. ఎందుకు వెళుతున్నావు అంటే లెక్కలు చెపుతున్నారు అని ఆ అమ్మాయి చెప్పింది. అప్పుడు అమ్మాయి తండ్రి ఐన్‌స్టీన్ దగ్గరకు వెళ్ళి మమ్మల్ని క్షమించండి, మా అమ్మాయికి మీరు ఎవరో తెలియక మీ ఇంటికి రోజూ వచ్చేస్తోంది, రేపటి నుండి ఇంక రానివ్వము అని చెప్పాడు. అప్పుడు ఐన్‌స్టీన్ ఏమి చెప్పాడు అంటే ఇప్పటి వరకు నన్ను అనేక సంస్థలు, వ్యక్తులు గౌరవించారు కాని మీ అమ్మాయి ఇచ్చినంత ఆదాయం నాకు ఎవ్వరూ ఇవ్వలేదు అని చెప్పాడు. అదేమిటండీ అని తండ్రి ఐన్‌స్టీన్‌ను అడిగాడు. నువ్వు మీ అమ్మాయికి ఒక డాలర్ ఇస్తున్నావు. అందులో 75 సెంట్లు నాకు ఇచ్చేస్తోంది అంటే మూడవ వంతు నాకు ఇచ్చేస్తోంది. ఇంత వరకు ఒక వ్యక్తి తన ఆదాయంలోగాని, ఒక సంస్థ తమ ఆదాయంలోగాని మూడవవంతు తెచ్చి ఇచ్చినవారు మీ అమ్మాయి తప్ప నాకు ప్రపంచంలో ఎవరూ లేరు. ఒక వంతు తను అనుభవించి, మూడు వంతులు నాకు ఇస్తోంది, ఇలా చేసిన వారు ఎవరూ లేరు. ఆ అమ్మాయిలో ఉన్న త్యాగానికి, లెక్కలు నేర్చుకోవాలనే తపనను చూసి చెపుతున్నాను అని ఆ అమ్మాయి తండ్రికి నమస్కరించి పంపించాడు. వాడు ఐన్‌స్టీన్. ఒక్క మాటకు నేను అబ్బురపడి పోయాను. ఇంతవరకు ఏ వ్యక్తి కూడా తన ఆదాయంలో మూడవ వంతు నాకు ఇవ్వలేదు, అది మీ అమ్మాయికే చెల్లింది అని ఐన్‌స్టీన్ అన్నాడు. ఐన్‌స్టీన్ ఆ అమ్మాయికి ఎంత ఇష్టంగా, ప్రేమగా లెక్కలు చెప్పాడో అంత ఇష్టం, ప్రేమ మనకు ఇతరుల పట్ల ఉంటే వారికి న్యాయం చేయగలము గాని లేకపోతే న్యాయం చేయలేము.

మీకు ఎప్పడైనా అశాంతిగా ఉంది అనుకోండి, అనారోగ్యంగా ఉంది అనుకోండి, ఇంట్లో ఏవైనా కష్టాలు వచ్చాయి అనుకోండి దేవుడిని ష్మరించుకొంటారు. మీకు అశాంతి లేదు అనుకోండి, అనారోగ్యం లేదు అనుకోండి, కష్టాలు లేవు అనుకోండి, పరిస్థితులు బాగా ఉన్నాయి అనుకోండి ఇంక మీకు దేవుడు అక్కరలేదు. మనందరం వ్యాపారస్థులం, మనం భక్తులం కాదు. మనస్సు శాంతిగా ఉన్నా, శాంతిగా లేకపోయినా దేహం ఆరోగ్యంగా ఉన్నా ఆరోగ్యంగా లేకపోయినా, పరిస్థితులు అనుకూలంగా ఉన్నా లేకపోయినా నిరంతరం భగవంతుడిని స్మరిస్తూ ఉంటే, భగవంతుడు ఉన్నాడనే విశ్వాసం కాపాడుకొంటూ ఉంటే ఆత్మజ్ఞానం పొందటానికి అది మనకు సహకరిస్తుంది. ఒక భక్తుడు భగవాన్ దగ్గరకు వచ్చాడు, అతడికి ఇంటి దగ్గర ఏవో బాధలు ఉన్నాయి. అతడు భగవాన్‌తో నన్ను మర్చిపోయావా అని అడిగాడు. భగవాన్ అతనివంక చూస్తూ ఏ అనుగ్రహం అయితే నిన్ను ఇక్కడకు తీసుకొని వచ్చిందో అది ఇప్పడూ ఉంది, ఎప్పడూ ఉంటుంది, నువ్వు తరించే వరకూ అది నిన్ను విడిచిపెట్టదు అని చెప్పారు. అది అహంకారం చెప్పిన మాట కాదు, ఈ సృష్టికి అంతకూ ఏ పరమాత్మ అయితే ఆధారంగా ఉన్నాడో ఆయన వాణి. ఇప్పడు మీ దేహప్రారబ్దం బాగాలేదు అనుకోండి, మీ పరిస్థితులు బాగాలేదు అనుకోండి భగవంతుడికి మీరు శరణాగతి పొందారు అనుకోండి, మీ శరణాగతి నిజమైతే మీ ప్రారబ్దం ఎంత చెడ్డగా ఉన్నా అది మీ మనస్సును ముట్టుకోదు. మనకు రోజులు బాగా వెళ్ళిపోతున్నా స్వప్నమే, బాగా వెళ్ళకపోయినా స్వప్నమే. మీకు వందకోట్లు డబ్బు ఉన్నా స్వప్నమే, మీకు డబ్బు లేకపోయినా అదీ స్వప్నమే. గురువుపట్ల, ఈశ్వరునిపట్ల శరణాగతి లేక వాడు తట్టుకోలేకపోతున్నాడు. తట్టుకోలేక భగవాన్ మీద నింద పడేస్తున్నాడు. గురువు అంటే దేహానికి సంబంధించిన వాడు కాదు, నీ శరీరం మారిపోయిన అనుగ్రహం వెంటాడుతుంది, వాడు గురువు. మనకు దేహబుద్ధి ఉంది కాబట్టి ప్రతీ విషయాన్ని దేహదృష్టితో చూస్తాము. అహంకారం లేనివాడికి దేహం ఏముంది. దేహాభిమానంతో చూస్తున్నాము కాబట్టి వాడు ఎక్కువ అని, వీడు తక్కువ అని, వాడు గొప్పవాడని, వీడు తక్కువవాడని వేరుభావన వస్తోంది. చైతన్యదృష్టి ఉన్నవాడికి అంతా చైతన్యమే. అహంకారం ఉన్నవాడికి దృశ్యాలు కాని, అహంకారం లేనివాడికి దృశ్యం ఏముంది. వేరుబుద్ధి తగ్గినప్పడు దృశ్యాలు కూడా తగ్గిపోతాయి. దృశ్యాలు ఎప్పడైతే వారించబడ్డాయో అప్పడు చిత్తం ఆత్మవైపుకు ప్రయాణిస్తుంది. మనస్సును పరిశీలించు, మనస్సు యొక్క చేష్టలను గమనించు, మనస్సును శోధించి శోధించి దాని మూలంలోనికి వెళితే ఉన్నది

మోక్షం, ఉన్నది శాంతి, అదే నిజమైన సంపద.

వెయ్యి కోట్లు డబ్బు ఉండి రోజూ దుఃఖపడేవారు ఉన్నారు, రోజూ కూలి పని చేసుకొంటూ ఆనందంగా ఉన్నవారు ఉన్నారు. బాహ్యంగా నీకు ఏమి ఉంది అనేది కాదు, నీ ప్రవర్తనను బట్టి, నీ బుద్ధిని బేలెన్స్ చేసుకొన్న దానిని బట్టి నీ హృదయంలో నుండి సుఖం, శాంతి వస్తాయి. అంతేగాని బయట పరిస్థితులు నీకు బాగా ఉన్నా శాంతి వచ్చేయదు. మీ మానసికపరిస్థితిని బట్టి ఆనందం ఉంటుంది. కొంతమంది పది అంతస్థుల మేడలో ఉండి ఏడుస్తూ ఉంటారు, కొంతమంది తాటాకు ఇంటిలో ఉండి ఆనందంగా ఉంటారు. ఆనందం మేడలో లేదు, నీ హృదయంలో ఉంది. నీ హృదయంలో ఉన్న జ్ఞానగంగ, శాంతిగంగ నీకు అందుతూ ఉంటే నీవు తాటాకు ఇంటిలో ఉన్నా ఐశ్వర్యవంతుడివే. పరిస్థితులు మీకు అనుకూలంగా ఉన్నప్పడు దేవుడిని మర్చిపోయి, పరిస్థితులు అనుకూలంగా లేనప్పడు దేవుడిని స్మరించుకొంటూ ఉంటే మీ మనస్సు అణగదు. తల్లికడుపులో నుండి బయటకు వచ్చినది మొదలు స్మశానంకు వెళ్ళేవరకు ఎవడి జీవితం ఒకే రకంగా వెళ్ళదు, ఇప్పడు మీరందరు ఇక్కడ కూర్చొన్నారు అంటే మీరు తల్లి కడుపులో నుండి బయటకు వచ్చినప్పడే ఈ సంవత్సరం అక్టోబరు 1వ తేదీన మధ్యాహ్నం నాన్నగారు ప్రసంగం వినేయోగం మీ ప్రారబ్దంలో ఉంటేనే మీరు ఇక్కడకు వస్తారు, ప్రారబ్దంలో లేకపోతే ఈ గోడ ప్రక్కన ఉన్న వాళ్ళు కూడా రారు. మీ దేహప్రారబ్దం ప్రకారం ఆ దేహం ఎప్పడు ఎక్కడ ఉండాలి, ఆ దేహం ద్వారా ఏ పనులు జరగాలి అవి అన్నీ ఈశ్వరనిర్ణయం ప్రకారం జరిగిపోతూ ఉంటాయి. ఆయన మీకు కనబడడు. ఆయన కనబడటం లేదు కాబట్టి ఈశ్వరుడు లేడు అనుకొంటున్నారు. మీరు పాలు, నీరు కలిపేస్తారు అనుకోండి, హంస పాలను తీసుకొంటుంది, నీటిని వదిలేస్తుంది. అలాగే జ్ఞాని సత్యాన్ని తీసుకొంటాడు, అసత్యాన్ని వదిలేస్తాడు; జ్ఞానాన్ని తీసుకొంటాడు, అజ్ఞానాన్ని వదిలేస్తాడు, ఆత్మను తీసుకొంటాడు, అనాత్మను వదిలేస్తాడు. మనం అనాత్మను పట్టుకొంటాము, ఆత్మను వదిలేస్తాము. అందుకే మనకు పునర్జన్మలు. భగవంతుడిని నిరంతరం స్మరించుకోండి అని నేను మీకు చెపుతున్నాను. ఈశ్వరుడిని స్మరించాలనే బుద్ధి కూడా గురువు అనుగ్రహం లేకుండా అది సాధ్యం కాదు. గురువు అంటే ఆత్మ. గురువు అనుగ్రహం ఎప్పడూ ఉంటుంది, అది చాలా బలీయమైనది, ఆయనలో నిన్ను ఐక్యం చేసే వరకు గురువు అనుగ్రహం నిన్ను విడిచిపెట్టదు. అది రెండు రోజులు, మూడు రోజుల ముచ్చట కాదు, అది జన్మాంతర అనుబంధం. గురువు మనలను తీసుకోకపోతే, ఆయన జ్ఞానం యొక్క వైభవం మనకు

చూపించకపోతే, మనకు అర్థమయ్యేలాగ చేయకపోతే మనం ఆయనను చేరుకోలేము. ఎప్పుడైనా మీకు అశాంతి వస్తూ ఉంటే, దుఃఖం వస్తూ ఉంటే కంగారుపడకండి, రానివ్వండి. అశాంతి ఎవరికి వస్తోంది, దుఃఖం ఎవరికి వస్తోంది, పొంగు ఎవరికి వస్తోంది, అహంకారానికే వస్తున్నాయి. ఇవన్నీ వచ్చేవాడు ఎవడు అని విచారణ వస్తుంది, దాని వలన మీ మనస్సు అంతర్ముఖమవుతుంది, అది కూడా ఒక వరమే అందుచేత కంగారుపడవద్దు. ఒక భక్తుడు భగవాన్‌ను అడుగుతున్నాడు. నాకు ఎంతో కొంత భక్తి ఉంది, ప్రేమ ఉంది. ఒక్కసారే నేను ఆత్మజ్ఞానాన్ని కోరుకోవటం లేదు. ఈశ్వరుడి పట్ల నాకు ఉన్న భక్తిని, ప్రేమను, ఆయన పాదాలయందు నాకు విశ్వాసాన్ని పెరిగేలా చేయండి. ముముక్షత్వాన్ని పెంచండి. భగవంతుడు మన హృదయంలో ఉన్నాడు అని చెపుతున్నారు కాని ఆయన నాకు అనుభవంలో లేనప్పుడు నాకు లాభం ఏమిటి? ఆయన అనుభవంలో ఉంటే కదా ఆయన తాలుక సుఖం, శాంతి నాకు అందేది. భగవదనుభవం కలిగేటట్లు అనుగ్రహించండి అని ఆ భక్తుడు అడుగుతున్నాడు. భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే భగవంతుడి పట్ల నీకు ఉన్న ప్రేమ నిజమైతే, నీకు ఉన్న భక్తి నిజమైతే, ఆ తపన నిజమైతే నీవు ఆత్మజ్ఞానం వద్దన్నా ఆత్మజ్ఞానం వచ్చే తీరుతుంది, ఆ భక్తిలో నీ మనస్సు కరిగిపోతుంది. ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అని వాడిపట్ల నీకు పరిపూర్ణమైన విశ్వాసం ఉంటే అందులో నీ మనస్సు కాలిపోతుంది. స్మరణ వలనకాని, శ్రవణం వలనకాని, ధ్యానం వలన కాని నీ మనస్సు నిర్మలమైతే, నీ మనస్సు నిశ్చలమైతే ఈ పూజించే నేను, జపించే నేను ఆత్మలో లయమవుతుంది. లోపల జపి ఉన్నాడు కాబట్టి మనం జపిస్తున్నాము, ఆత్మ సాక్షాత్కారంలో ఈ జపి కూడా ఆత్మలో లయమయిపోతాడు. లోపల జపం చేసేవాడు లేడనుకోండి, ఇంక జపం ఎవరు చేస్తారు. ఆ రకంగా చివరకు నీ జపధ్యానములు, శ్రవణాలు, పూజలు, యజ్ఞాలు, పుణ్య క్షేత్ర దర్శనాలు, సత్పురుషుల సహవాసం వలన వీటి అన్నింటి వలన చివరకు మీకు కలిగేది ఏమిటి అంటే ఆత్మతోటి అనుసంధానం, ఆత్మలో ఐక్యమవ్వటం. ఆత్మ సముద్రం అయితే ఇప్పుడు మనం నేను, నేను అనుకొనేది చిన్న బుడగ, బుడగపోతే బుడగపోయింది, పోయింది అనుకొంటాము. బుడగ పోదు సముద్రం అవుతుంది. అదే విధంగా ఈ నేను పోతే నువ్వు పోవు, నీకు బ్రహ్మానుభవం కలుగుతుంది. ఆ స్థితి నీకు వచ్చినప్పుడు ఉన్నదే శాంతి, ఉన్నదే ఆనందం.

మీకు గౌరవాల పట్ల ఉన్న ఆసక్తి, ధనం పట్ల ఉన్న ఆసక్తి, లోకవిషయాల మీద ఉన్న

ఆసక్తి, దేహం పట్ల ఆసక్తి అందులో ముల్లంతైనా భగవంతుడి పట్ల నీకు ఆసక్తి ఉందా? వారు గుడికి వెళుతున్నారు అని మనమూ వెళ్ళటం, వారు అరుణాచలం వెళుతున్నారు అని మనమూ వెళ్ళటం, ఏదో యాంత్రికంగా చేస్తున్నాము అంతేగాని మనకు భగవంతుడిపట్ల భక్తి ఉందా, విశ్వాసం ఉందా? బాహ్యప్రక్రియల వలన మనం భగవంతుడిని మోసం చేయలేము. భగవంతుడు మన హృదయంలోనే ఉన్నాడు. నీకు లోచూపు కలిగినప్పుడు ఆయన వ్యక్తమవుతాడు. మీరు మంచి పనులు చేయండి. మీరు చేసే మంచి పనుల వలన మనస్సుకు నిర్మలత్వం రావాలి, మనస్సుకు లోచూపు రావాలి. అది వస్తుందో లేదో చూసుకోండి. అహంకారంతో చేసే పనులతో నీకు నిర్మలత్వం రాదు, ఆత్మజ్ఞానం కలుగదు. నీవు అహంకారం పెట్టుకొని బయట పనులు చేస్తావు కాని భగవంతుడు లోపల ఉన్నాడు. అహంకారంతో చేసే పనుల వలన ఆయన ఎలా తెలియబడతాడు. భగవంతుడు సర్వజ్ఞుడు. ఈ సృష్టిలో ఎక్కడ ఏమి జరుగుతోందో ఆయనకు తెలుసు. ఆయన దగ్గరా నీ కుప్పిగంతులు. మనకు దేహం పట్ల అహంబుద్ధి, మనస్సు పట్ల అహంబుద్ధి ఎంతకాలం అయితే ఉందో అంతకాలం ఈశ్వరుడి పాదాలను విడిచిపెట్టకూడదు. ఈశ్వరుడి పాదాలను విడిచిపెడితే ఇహం లేదు, పరం లేదు. గాఢనిద్రలో నీకు దేహం గొడవ లేదు, లోకం గొడవ లేదు, దేవుడి గొడవ లేదు. అక్కడ నీవు సుఖంగా ఉన్నావు. జాగ్రదవస్థలో నీకు అన్ని గొడవలు వచ్చేస్తున్నాయి. ఏది వచ్చాక అంతా వస్తోందో ఆ సమస్యను పరిష్కారం చేసుకోకుండా నీకు ఆత్మజ్ఞానం కలుగదు. ఒకవేళ జపం చేసినప్పుడు, ధ్యానం చేసినప్పుడు నీ మనస్సు నిర్మలంగా ఉండవచ్చు, అంత మాత్రంచేత మనస్సును జయించాను అనుకోవద్దు. మనస్సు ఎక్కడైతే ఉదయించి వచ్చిందో ఆ మూలంలోనికి వెళ్ళి ఐక్యమయ్యే వరకు మనస్సు నశించదు. భగవంతుడిలో మనస్సు ఐక్యమైన తరువాత వచ్చేదే నిజమైన శాంతి. మనిషికి వాడి అహంకారమే పెద్ద జబ్బు. శరీరానికి వచ్చిన జబ్బును డాక్టర్లు తగ్గించవచ్చు లేకపోతే ఆ శరీరం పోయినప్పుడు ఆ జబ్బు కూడా పోతుంది. శరీరం చనిపోయినా ఈ అహంకారం అనే జబ్బు పోదు. ఏవో పుస్తకాలు చదవటం వలన ఈ జబ్బు పోదు. ఈ జబ్బు పోయేవరకు మనకు ఆత్మలాభం లేదు, మనకు జన్మలు తప్పవు. గురువు అనుగ్రహం వలన మాత్రమే ఈ జబ్బులో నుండి మనం బయట పడగలము.

# సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 03-10-06, నరసాపురం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఇప్పుడు మేము బాబాగారి దర్శనం చేసుకొని వచ్చాము, అక్కడ హాలులో ఒక వాక్యం చదివాము. మనం మంచిగుణాలు అలవాటు చేసుకోవచ్చు కాని ఈశ్వరుడి పట్ల కృతజ్ఞతాభావం కలిగిఉండటం కష్టం అని బాబాగారు చెప్పినమాట. మంచిగుణాలు నేర్చుకోవటం కంటే కృతజ్ఞత నేర్చుకోవటం కష్టం. మీరు మంచిగుణాలు సంపాదించినా, ఎన్ని రకాల సాధనలు చేసినా, ప్రజాసేవ చేసినా, శాస్త్రాన్ని అధ్యయనం చేసినా ఇవన్నీ మంచివే కాని గురువుఅనుగ్రహం లేకుండా, సద్వస్తువు యొక్క కటాక్షం లేకుండా మీకు ఆత్మలాభం కలుగదు. దిస్ ఈజ్ ఫైనల్ వర్డ్. ఏదో కేవలం మన తెలివితేటల వలన పొందేది కాదు. మన డబ్బు అంతా ఖర్చుపెడతాము అనుకోండి, మన ధైర్యం అంతా ఉపయోగిస్తాము అనుకోండి, మన తెలివి అంతా ఉపయోగిస్తాము అనుకోండి ఇవన్నీ చేసినా గురువు అనుగ్రహం లేకుండా ఆత్మజ్ఞానం కలిగే అవకాశం లేదు. ఎందుచేతనంటే మనకు ఉన్నధైర్యం, మనకు ఉన్న తెలివితేటలు అనేవి మనస్సుకు సంబంధించినవి. మనోదేహములు మారుతూ ఉంటాయి. ఏ వస్తువు అయితే అన్ని కాలాలలో, అన్ని ప్రాంతాలలో, అంతటా వ్యాపించి ఉంటుందో దాని తాలుక దయ లేకుండా ఆ వస్తువును మనం పొందలేము. మన అహంకార ప్రదర్శన కోసం మాట్లాడినా, అహంకార ప్రదర్శన కోసం పనులు చేసినా ఈశ్వరుని దయ కలుగదు. ఆయన దయలేకుండా మనం ఆయనను పొందలేము. మనం చేసేది తక్కువ ఆ వేగం అక్కడ నుండే రావాలి. ఈ గోడ ప్రక్కన ఏముందో మనకు తెలియదు, ఇంకో గంటలో ఏమి జరుగుతుందో మనకు తెలియదు. మన తెలివి ఎంత? కేవలము ఈ ప్రయత్నముల వలన మనకు ఆత్మజ్ఞానం కలుగదు. ఈశ్వరుని ప్రీత్యర్థం మనం పనిచేస్తూ ఉంటే, ఈశ్వరుని ప్రీత్యర్థం మనం మాట్లాడుతూ ఉంటే నది సముద్రంవైపుకు ఎంత వేగంగా వెళుతుందో మనకు వచ్చే తలంపులు, మనకు వచ్చే ఆలోచనలు, మనం చేస్తున్న పనులు అంత వేగంగా ఈశ్వరుని వైపుకు మళ్ళించబడుతూ ఉంటే అప్పడు ఈశ్వరానుగ్రహం కలుగుతుంది. మన మాట, మన చేత, మన ప్రవర్తనకు లోపల ఉన్న ఈశ్వరుడు సాటిస్ఫై అయితే అప్పడు మనమీద ఆయనకు దయకలిగి ఆయన స్వరూపాన్ని మనకు ఇస్తాడు కాని దీనికి ఇంకొక మార్గం లేదు. మీరు డబ్బు సంపాదించుకోండి, పదవులు

సంపాదించుకోండి, గౌరవాలు సంపాదించుకోండి, విద్య సంపాదించుకోండి, ఇలా ఎన్ని అయినా సంపాదించుకోవచ్చు కాని ఈశ్వరుని దయ లేకుండా ఈశ్వరుడు తెలియబడడు.

మనం ఇంద్రియాలతోటి, మనస్సుతోటి బాహ్యంగా ఏవో సుఖాలు అనుభవిస్తున్నాము ఈ ఎంజాయ్‌మెంట్సు అన్నీ ఈజన్మలో కాకపోయినా రాబోయే జన్మలో అయినా మొత్తం అన్నీ దుఃఖంగా మారిపోతాయి. అది చట్టం, దీనికి మీరు నేను చేసేది ఏమీ లేదు. దేహాన్ని ప్రారబ్దానికి విడిచిపెట్టేయండి. ఆ దేహం ద్వారా మీరు పొందవలసిన అనుభవాలు పొందాక ఒక్క క్షణం కూడా ఈశ్వరుడు మిమ్మల్ని ఆ దేహంలో ఉంచడు. ఈ ప్రపంచం అనేది ఒక పాఠశాల. రమణమహర్షి, రామకృష్ణ పరమహంస ఏ కాలేజీల్లో చదువుకున్నారు, పూర్వపు ఋషులు ఏ కాలేజీల్లో చదువుకున్నారు. ఈ ప్రకృతిని చూసి, వాళ్ల మనసుల్ని పరిశీలించి అనేక పాఠాలు నేర్చుకొన్నారు, ఉత్తమోత్తములై ఉన్నతస్థితిని, ఉత్తమస్థితిని అందుకొన్నారు. మనం ఉత్తమోత్తములం అవ్వకుండా ఉత్తమస్థితిని పొందాలని చూస్తున్నాము, మనం ఉత్తమోత్తములం అవ్వకుండా ఉత్తమస్థితిని అందుకోవటం అంటే చిన్నగుడిసెలోనికి ఏనుగును తోలితే ఆ గుడిసె పని ఏమౌతుందో మన జీవితం కూడా అలాగే అవుతుంది. అర్హత లేకుండా, ఆ అంతస్థు లేకుండా ఆత్మజ్ఞానం పొందాలి అనుకొంటే చివరకు ఆశాభంగం కాని అసలువస్తువు దొరకదు. మనకు తెలివి ఉన్నా, అధికారం ఉన్నా, డబ్బు ఉన్నా అది వీటితో పొందే వస్తువు కాదు. సత్యవస్తువు నీలోపలే ఉంది, అది ఆనందంగా ఉంది, శాంతిగా ఉంది, అది నీవై ఉన్నావు. దాని తాలుక అనుభవం నీకు కలిగేవరకు శాంతి కోసం, సుఖం కోసం బాహ్యంగా వెతుక్కొంటూ ఉంటావు, ఇలా అనేక జన్మలు గడిచిపోతాయి, ఈ ప్రవాహాన్ని ఎవడూ ఆపుచేయలేడు. దేహాభిమానం ఉన్నవాడు, వాడు ఎంతపండితుడైనా వాడికి ఆత్మజ్ఞానం కలిగే అవకాశం లేదు.

ఈ దేహమే నేను అని మనం అనుకొంటున్నాము కాని ఈ దేహానికి మనకు ఎట్టి సంబంధం లేదు. గాఢనిద్రలో మనం దేహంతోటి, మనస్సుతోటి, ఈ లోకంతోటి సంబంధం లేకుండా సుఖంగా, శాంతిగా ఉన్నాము. పాము నోటిలో ఎంత విషం ఉందో, ఈ నేను అనే రెండు అక్షరాలలో అంతకంటే ఎక్కువ విషం ఉంది. ఎందుచేతనంటే ఈ నేను వచ్చాక మనస్సు వస్తోంది, శరీరం వస్తోంది, తరువాత లోకం, దేవుడు, పుణ్యపాపాలు, రాబోయే జన్మలు అన్నీ వస్తున్నాయి. ఈ నేను ఉంటే అంతా ఉంది, అది లేకపోతే ఏమీ లేదు, అందుచేత విషం అంతా ఈ నేనులోనే ఉంది. మీరు ఫిజిక్స్ నేర్చుకొంటున్నారు, లెక్కలు నేర్చుకొంటున్నారు,

ఇంకా అనేక విద్యలు నేర్చుకొంటున్నారు. ఇవన్నీ దేనితో నేర్చుకొంటున్నారు? మిథ్యానేనుతో నేర్చుకొంటున్నారు. ఈ నేను ఎంత నిజమో దానితో నేర్చుకొనే విద్యలు కూడా అంతే నిజం. నీ పొట్ట పోషణకు ఈవిద్యలు పనికి వస్తాయి కాని లోపలఉన్న సత్యాన్ని తెలుసుకోవటానికి ఈవిద్యలు ఏమాత్రం పనికిరావు, ఇవి అన్నీ యూజ్‌లెస్ అండ్ వర్త్‌లెస్, కొంచెం కఠినమైన మాటలు చెప్పవలసి వస్తోంది. ఒకసారి నరేన్, రామకృష్ణుడు కూర్చున్నారు. రామకృష్ణుడు ఆయన కాలు పైకి తీసి నరేన్ నెత్తిమీద పెట్టారు. అప్పటికి ఆయన ఇంకా చదువుకొంటున్నాడు. ఇదేమిటి నాకు ఇంటి దగ్గర అమ్మ ఉంది, చెల్లెలు ఉంది, వారిని నేను పోషించాలి నన్ను నాకు కాకుండా చేస్తున్నావు అని వెర్రికేక వేసాడు. అప్పడు కాలు దింపేసి సరిపోతుంది అని చెప్పలేదు, ప్రస్తుతానికి ఇది సరిపోతుంది అన్నాడు. ఒక్కసారి లోపలఉన్న సంస్కారాన్ని కెలికి విడిచిపెట్టాడు. అమ్మని బాగా చూడాలి, చెల్లెలిని బాగా చూడాలి అనే సంస్కారం బలీయంగా ఉంది, అది బయటకు కక్కేసాడు. మన శరీరం ఏదో రోజున శవం అవుతుంది. మనలో అనేక వాసనలు ఉంటాయి. మనకు బాగా ఇష్టమైన వాసన మరణసమయంలో బ్రెయిన్‌లో తిరుగుతూ ఉంటుంది, దానిని బట్టే నీకు పునర్జన్మ నిర్ణయింపబడుతుంది, బురద పాము నోట్లోపడ్డ కప్పని ఒకవేళ ఆ బురదపాము మింగలేక విడిచిపెట్టేయవచ్చు గాని తాచుపాము నోట్లోపడ్డ కప్ప బయటకు రాలేదు, ఇంక దాని ప్రాణం పోవలసిందే అలాగే ఒక మహాగురువు అనుగ్రహంలో, జ్ఞానగురువు యొక్క అనుగ్రహంలో పడితే నీపని పూర్తి అయిపోతుంది, ఇంక అందులో నుండి నీవు తప్పించుకొనే అవకాశం లేదు. ఏరోజుకారోజు మన శరీరానికి స్నానం ఎలా చేస్తామో అలాగ మన మనస్సును ఎప్పటికప్పడు బేలెన్స్ చేసుకొంటూ ఉంటే రాంగ్ స్టెప్ పడదు. ధనం సంపాదనకు, చదువు నేర్చుకోవటానికి, కుటుంబపోషణకు ఎంత కష్టపడుతున్నారో అందులో వందో వంతైనా ఆత్మజ్ఞాన సముపార్జనకు మీరు కష్టపడుతున్నారా, ఒక్కసారి జాగ్రత్తగా ఆలోచించుకోండి. మనం కష్టపడి సాధనలు చేస్తున్నప్పటికి మనకు ఆత్మజ్ఞానం కలగకపోవటానికి దేహంతో మనకు అతిగా తాదాత్మ్యం ఉండటమే కారణం. అంటే మనం ఏదైతే కాదో దానితో అతిగా తాదాత్మ్యం పొందుతున్నాము, ఇలా అనేకజన్మలు గడిచిపోతున్నాయి, మనం అలాగే ఉంటున్నాము. ఏదో దైవానుగ్రహం వలన, గురువు అనుగ్రహం వలన ఇందులోనుండి బయటపడాలి తప్ప మన తెలివితేటల వలన ఇందులో నుండి బయటకు రాలేము. భౌతికమైన పనుల విషయంలో కూడా మనం ఏదో పని చేయటానికి ప్రయత్నం చేస్తాము, ఆ పని జరగవచ్చు, ఒకోసారి జరగకపోవచ్చు. అదే దేవుడు

చేసి పెట్టాలనుకొంటే ఆయనకు అడ్డేముంది, ఆ పని అయిపోతుంది. అలాగే భగవంతుడు మనకు జ్ఞానాన్ని ఇవ్వాలనుకొంటే ఇంక అడ్డేమిటి, ఒకవేళ నీవు అంటే అసూయ ఉన్నవారు అడ్డుపడినా అది ఆగుతుందా? ఆగదు. నీకు వేరుబుద్ధి ఉన్నంతకాలం, మిథ్యానేను యొక్క చేష్టలు ఉన్నంతకాలం దైవస్మరణ విడిచిపెట్టకు, గురువు పాదాలను విడిచిపెట్టవద్దు. నేను ఇంటి దగ్గర కష్టాలు భరించలేకపోతున్నాను అని ఒక భక్తుడు భగవాన్‌ను అడుగుతున్నాడు. ఈశ్వరుడిపట్ల భక్తిభావన, ప్రేమభావన ఆయన పట్ల శరణాగతి సరిపోకపోతే గాలివాన వచ్చినప్పుడు చెట్టు ఎలా ఊగుతుందో అలాగ కష్టాలు భరించలేక నీ మనస్సు ఊగిపోతూ ఉంటుంది. ఆ కష్టాల నుండి వాడు నేర్చుకొనే పాఠాలు కూడా ఉంటాయి. భక్తుడికీ కష్టాలు వస్తాయి, భక్తుడు కాని వాడికి కష్టాలు వస్తాయి. భక్తుడు వాటిని సంతోషంగా అనుభవిస్తాడు. భక్తుడు కానివాడు వాటిని భరించలేకపోతున్నాను అంటాడు, వాటిని ఏడుస్తూ అనుభవిస్తాడు. అనుభవించటం ఎలాగూ తప్పదు, ఆ ప్రారబ్ధాన్ని ఎవడైతే సంతోషంగా అనుభవిస్తున్నాడో రాబోయే జన్మలలో వాడికి అది రిపీట్ అవ్వదు. ఏడుస్తూ అనుభవిస్తాము అనుకోండి రాబోయే జన్మలలో అవే కష్టాలు మరల సిద్ధమవుతాయి. మనం ఎన్ని సంవత్సరాలు బతికినా గురువు అనుగ్రహం లేకపోతే ఎంతకాలం అయినా అలా బయటికే చూస్తూ ఉంటాము. లోపల ఏముందో చూసుకొందాము అనే తలంపు రాదు. మనకు పుణ్య బలం లేకపోతే లోచూపు కలుగదు. మనం సమ్‌తింగ్, సమ్‌తింగ్ అనుకొంటూ ఉంటే ఈశ్వరుడి వైభవం తెలియదు, మనం నతింగ్ అన్న సంగతి తెలుసుకొన్నప్పుడే ఈశ్వరుడి వైభవం మనకు తెలుస్తుంది.

భగవాన్ హాలులో ఒక ఉడుత పిల్లలను పెట్టుకొంది. పిల్లలు అక్కడ ఉండగా ఉడుత బయటకు వచ్చి తిరిగేది, అలా బయట తిరుగుతున్నప్పుడు ఆ ఉడుతను పిల్లి తినేసింది. అప్పుడు భగవాన్ అన్నారు అది చనిపోయింది, పిల్లలను పెంచే బాధ్యత నా నెత్తిమీద పడింది, తల్లి లేదు కదా నేనే వాటిని చూడాలి అని ఆ పిల్లలకు జీడిపప్పు, వేరుసెనగ పప్పు చిన్న చిన్న ముక్కలుగా చేసి పెట్టేవారు. అయితే అవి కొంత పెద్దవి అయ్యాక బయటకు రావటం మొదలుపెట్టాయి. భగవాన్ వాటిని మరల గూటిలో పెట్టేవారు. ఏమిటి స్వామీ వాటిని పట్టుకొని మరల గూటిలో పెడుతున్నారు అని అడిగితే ఇదంతా సాధనే అన్నారు భగవాన్. ఉడుత పిల్లలు బయటకు వస్తూ ఉంటే వాటిని మరల గూటిలో పెడుతున్నారు. అలాగే మీ మనస్సు దాని పుట్టుస్థానమైన హృదయాన్ని విడిచిపెట్టి బయటకు వచ్చేస్తోంది, మనం సాధన

చేసి మరల మనస్సును హృదయంలో నిలబెట్టాలి. ఇదే సాధన ఇంతకంటే ఏమీ లేదు. అవి ఎప్పుడు బయటకు వస్తాయా తినేద్దామా అని పిల్లి కనిపెట్టుకొని ఉంది, అలాగే మాయ కనిపెట్టుకొని ఉంది. నేను ఎప్పటి వరకు వాటిని గూటిలో పెడుతూ ఉంటాను అంటే అవి ఎంతకాలం అయితే బయటకు వస్తూ ఉంటాయో అంతకాలం వాటిని గూటిలో పెట్టటం మానను. వాటి అలవాటు అవి మాననప్పుడు నా అలవాటు నేనెందుకు మానతాను. అవి గూటిలో నుండి బయటకు రావటం మానేసే వరకూ నేను వాటిని లోపల పెట్టటం మానను. మీరు చెయ్యవలసింది కూడా అంతే. హృదయాన్ని విడిచిపెట్టి మనస్సు బయటకు వస్తున్నంత కాలం మీరు సాధన చేసి దానిని లోపలకు పంపవలసిందే. అది హృదయంలో ఆగిపోయింది అనుకోండి, అక్కడ స్థిరమయిపోయింది అనుకోండి, ఇంక సాధనతో పనిలేదు. బయటకు వచ్చి తిరుగుతూ ఉంటే అస్తమాను పట్టుకొని లోపల పెడుతున్నారు అని వాటికి కోపం వచ్చి కరిచినా ఓర్చుకొని భగవాన్ చేసేపని మానేవారు కాదు. గురువు అంటే ఇష్టం లేకపోయినా, మనం గురువును తిట్టినా ఆయన మనలను విడిచిపెట్టడు. ఒకసారి గురువు అనుగ్రహంలో పడినవాడు తరించబడతాడు కాని అందులో నుండి తప్పించుకొనే అవకాశం లేదు, ఆయన ఏ స్థాయిలో ఉన్నాడో ఆ స్థాయిని పొందేవరకు గురువు మిమ్మల్ని విడిచిపెట్టడు. గురువు అనుగ్రహం వలన నీ బుద్ధి శుద్ధి అయ్యింది అనుకో కుళాయి తిప్పితే నీరు ఎలా కారిపోతుందో అలాగ హృదయంలో ఉన్న ఆనందం వచ్చి నిన్ను ముంచేస్తుంది. అప్పుడు నీ మనస్సు బయటకు వెళ్ళదు, బయట ఏమీ లేదు అన్న సంగతి దానికి తెలుస్తుంది, అప్పటివరకు మీరు సాధన చేయవలసిందే. నది వెళ్ళి సముద్రంలో ఎలా కలిసిపోతుందో అలాగ మనస్సు వెళ్ళి హృదయంలో కలిసిపోతే, హృదయాకారం చెందితే అక్కడ నుండి శాంతి తరంగాలు, శక్తి తరంగాలు ప్రవహిస్తాయి. దేహాభిమానం పెట్టుకొని ఎన్ని రచనలు చేసినా, ఎన్ని ఉపన్యాసాలు చెప్పినా ఒక వ్యక్తియొక్క మనస్సులో మార్పు రాకపోవచ్చుకాని ఒక మహాత్ముడు సమక్షంలో, మహాజ్ఞాని సమక్షంలో మనస్సుకు లోచూపు కలుగుతుంది, మారుమనస్సు వస్తుంది, ముముక్షత్వం వస్తుంది, ఆ మౌనం యొక్క వైభవం అట్టిది. ఒక విషయం గుర్తుపెట్టుకోండి. నీకు దేహబుద్ధి ఉన్నంతకాలం ఏదో ఒక అవతారపురుషుడి యొక్క రూపాన్ని, నామాన్ని ఆశ్రయించవలసిందే. ఈ దేహము నువ్వు కాదని నీకు తెలిసినప్పుడు ఈశ్వరుడికి కూడా దేహం లేదని నీకు తెలుస్తుంది. నీవు వేరు, నేను వేరు, నేను జీవుడను నీవు ఈశ్వరుడవు అని అనుకొన్నంతకాలం, ఆ వేరుబుద్ధి ఉన్నంతకాలం నిన్ను ఏదో వరాలు అడగాలనిపిస్తుంది.

చాలామందికి జ్ఞానం కంటే మహిమలు అంటే ఎక్కువ ఇష్టం, అదొక మాయ. మనస్సు ఉన్నంతకాలం వరాలు, మహిమలు, భోగాలు ఈ గొడవలలో నుండి ఎవరూ తప్పించుకోలేరు. నీవు వేరు, నేను వేరు అనే బేధబుద్ధి ఎప్పుడైతే పోయిందో అప్పుడు నిజమైన ఆనందం, నిజమైన శాంతి నాకు అనుభవంలోనికి వస్తుంది, అట్టి స్థితిని అనుగ్రహించు అరుణాచలేశ్వరుడా అంటున్నారు భగవాన్.

ఒక మహర్షి యొక్క సమక్షంలో ఉన్నప్పుడు, మన మనో దేహములకు అతీతంగా పంచభూతాలకు అతీతంగా, చావు పుట్టుకలకు అతీతంగా మన హృదయంలో ఏదో ఒకటి ఉంది అనే విషయం మనకు స్ఫురింపజేస్తాడు, వాడే మహా గురువు. వాడే మహాజ్ఞాని. మన హృదయంలో ఏదో వస్తువు ఉందని మనకు స్ఫురిస్తే కదా దానిని సంపాదించటానికి మనం ప్రయత్నం చేస్తాము. ఆ స్ఫురించటం కూడా గురువు అనుగ్రహం లేకుండా మీకు సాధ్యం కాదు, మీరు ఎంత పండితులు అయినా సాధ్యం కాదు. మీరు ఒక మహర్షి దగ్గరకు, ఒక మహాజ్ఞాని దగ్గరకు వెళతారు అనుకోండి. ఆయన మీతో మాట్లాడనక్కరలేదు. మీతో మాట్లాడటం లేదని కోపాలు తెచ్చుకోవద్దు. ఆయనకు మాటలతో పని లేదు. గురువు దగ్గరకు వెళ్ళాము ఒక్కమాట కూడా మాట్లాడలేదు, అసలు మావంక చూడలేదు అని అలా అనుకోవద్దు. ఆయన మీ వంక చూడకుండా, మీతో మాట్లాడకుండా పని చేస్తాడు. గురువు అంటే ఆత్మ, ఆత్మ మిమ్మల్ని చూడకుండా ఉంటుందా. మనకు దేహబుద్ధి ఉంది కాబట్టి ఆయన మొఖం మన వంక తిప్పి మనలను చూడలేదు అనుకొంటాము. గురువు అంటే ఆత్మ. ఆత్మ అంతా చూస్తూనే ఉంటుంది. ఆయన నన్ను పలుకరించలేదు, నావంక చూడలేదు అని ఈ పిచ్చి అంతా తీసుకొని వెళ్ళి అక్కడ పెట్టవద్దు. ఆయన మీవంక చూడకపోయినా, మీతో మాట్లాడకపోయినా ఆయన మౌనం చాలు మిమ్మల్ని అనుగ్రహించటానికి, అవయవాలతో పని లేదు. ఇప్పుడు మనం కూడా తక్కువ మాట్లాడాలి, ఎక్కువ పనిచేయాలి. చేసేటప్పుడు ఇంక చెప్పటం ఎందుకు? గురువు యొక్క మౌనం ఎంత బలీయమైనది అంటే మహా ప్రవాహంలో గడ్డిపరక ఎంత వేగంగా కొట్టుకొనిపోతుందో, గురువు యొక్క మౌనం నీ మనస్సును హృదయంలోనికి అంత వేగంగా గెంటుకొనిపోతుంది.

మీ హృదయంలోనే సత్యవస్తువు ఉంది, అది కొత్తగా ఇచ్చేది ఏమీ కాదు. గురువు అనుగ్రహం వలన మీకు ఆత్మజ్ఞానం కలిగితే, ఆత్మజ్ఞానంలో నుండి వచ్చే మహావెలుగులో మీ హృదయంలో ఉన్న వస్తువు మీకు స్పష్టంగా గోచరిస్తుంది. ఉన్నది ఒక్కటే వస్తువు, అది

మీకు అనేకంగా కనిపిస్తూ ఉంటే అది మాయ. మట్టితోటి కుండలు రకరకాలుగా చేయవచ్చు, ఆ నామరూపాలు మాయ కాని మట్టి నిజం. ఎందుచేతనంటే ఆ నామరూపాలు పోయినా మట్టి ఉంటుంది. కుండ కూడా నిజమే, కుండ కుండగా నిజం కాదు మట్టిగా నిజం. అలాగే ఈ లోకం లోకంగా నిజంకాదు, బ్రహ్మంగా నిజం. కుండలలో వివిధ రకాల నామ రూపాలలో ఉన్నది కూడా మట్టే. మనం ఆ నామరూపాలను చూస్తున్నాము గాని ఆ నామ రూపములకు ఆధారంగా ఉన్న మట్టిని చూడలేకపోతున్నాము, ఆ మట్టిని చూడగలిగితే నీకు వికారాలు ఆగిపోతాయి. ఆ ఆకారాల వలననే వికారాలు వస్తున్నాయి కాని ఆకారాలు పోతే ఇంక వికారాలు లేవు. మనం ఎవరినైనా ఒక వస్తువు అడిగి పుచ్చుకోవటం వేరు, వారికి ఇవ్వాలి అని ఇవ్వటం వేరు. ఇవ్వాలని ఇచ్చినప్పడు ఉంది దాని వైభవం. నీ ఆలోచనల తోటి, నీ ప్రయత్నాల తోటి సంబంధం లేకుండా గురువు యొక్క సమక్షంలో ఆయన అనుగ్రహం వలన నీ హృదయంలో ఉన్న సత్యవస్తువు నేచురల్‌గా, నార్మల్‌గా నీకు ఎరుకలోనికి వస్తుంది, అది గురువు యొక్క వైభవం. ఏకమక్షరం హృదినిరంతరం భాసతేస్వయం. ఉన్నది ఒక్కటే వస్తువు. అది ఎప్పడూ ఉంటుంది, దానికి నాశనం లేదు, అది స్వయం ప్రకాశం. నేను మిమ్మల్ని చూడాలంటే బాహ్యమైన సూర్యుడు యొక్క కాంతిగాని, కరెంటు సహాయం గాని అవసరం, ఆ వెలుగు లేకపోతే మీరు నాకు కనబడరు, నేను మీకు కనబడను. హృదయంలో ఉన్న వస్తువుకు బయట వెలుగులు అంటే సూర్యకాంతిగాని, దీపాలకాంతిగాని ఏదీ అక్కరలేదు, అది స్వయంప్రకాశం, అది ఉండటం వలననే అది తెలియబడుతూ ఉంటుంది. అట్టి స్వయం ప్రకాశమైన వస్తువును అశాంతిగాని, దుఃఖంగాని, చావుపుట్టుకలు గాని ఏమీ ముట్టుకోవు. అది స్వతంత్రమైనది. అట్టి శక్తి స్వరూపమైన, జ్ఞాన స్వరూపమైన, ఆనంద స్వరూపమైన వస్తువు గురించి చెప్పమంటున్నావు, దాని గురించి నోటితో ఎలా చెప్పగలను, కలంతో ఎలా వ్రాయగలను. అది నోటితో చెప్పేదికాదు, కలంతో వ్రాసేది కాదు. గురువు అనుగ్రహం వలన మాత్రమే హృదయంలో ఉన్న సద్వస్తువు మనకు ఎరుకలోనికి వస్తుంది.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 18-10-06, కువైట్

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం ఏ మతంలో ఉన్నా పవిత్రత చాలా ముఖ్యం. ఎవడికైతే పవిత్రత లేదో, ఎవడి ప్రవర్తన అయితే యింపెర్సనల్‌గా లేదో వాడి మనస్సుకు అంతర్‌దృష్టి రాదు. మన హృదయంలో

ఉన్న సత్యం మనకు అనుభవంలోనికి వచ్చేవరకు నామరూపములు రెండూ మనలను బంధిస్తాయి. ఫలానా శరీరం నాది, ఫలానా పేరు నాది అని ఆ శరీరంతోటి, పేరుతోటి తాదాత్మ్యం పొందుతున్నంత కాలం నీకు ఫ్రీడమ్ లేదు. ఈ ప్రపంచంలోనికి మనం ఎందుకు వచ్చామో అది మరిచిపోవద్దు. ఈ ప్రపంచం అనేది ఒక ట్రైనింగ్ గ్రౌండ్. దీనికే భగవాన్ చెప్పారు. ఈ ప్రపంచం అనేది ఒక అద్దం లాంటిది. అద్దం మంచిదీ కాదు, చెడ్డదీ కాదు, నీ మొఖంలో ఉన్న మచ్చలను, దుమ్మును అద్దం చూపిస్తుంది. అద్దంలో మొఖాన్ని చూసుకొని ఆ దమ్మును నీవే తీసేసుకోవాలి కాని అద్దం ఆ దుమ్మును తీయదు, దుమ్మును చూపిస్తుంది అంతే. అలాగే ఈ ప్రపంచం మంచిదీ కాదు, చెడ్డదీ కాదు. నీలో ఉన్న బలహీనతలను అది చూపిస్తుంది. ప్రపంచం చూపించకముందు ఆ బలహీనతలు ఉన్నట్లు నీకు తెలియదు. నీలో ఆ బలహీనతలు ఉన్నాయి అని తెలిసాక నీవు ప్రయత్నం చేసి వాటిని తొలగించుకోవాలి కాని ప్రపంచం వాటిని తొలగించదు. మనం శాస్త్రంలో చదివిన విషయాలను, మహాత్ములు చెప్పిన మాటలను మన బ్రెయిన్‌లో తిప్పకోవాలి, నవ్వు ఎవరో నీవు తెలుసుకోవటానికి ఇదంతా ఉపయోగపడుతుంది. గీతలో భగవంతుడు ఏ పనులు చేయమని చెప్పాడో, ఆ పనులు చెయ్యి, ఆయన చెయ్యవద్దు అని చెప్పిన పనులు చేయకు. నీవు ఆ రకంగా జీవిస్తూ ఉంటే గమ్యాన్ని చేరుకొంటావు, భగవదనుభవం కలుగుతుంది, దుఃఖరహితస్థితిని పొందుతావు.

ఉన్న వస్తువు ఉన్నట్లుగా నీకు ఎరుకలోనికి వచ్చేవరకు లేనిది ఉన్నట్లుగా నీకు కనిపిస్తూ ఉంటుంది. నీ హృదయంలో ఉన్న సత్యం నీకు తెలిసేవరకూ సత్యం కానిదానిని నువ్వు సత్యం అనుకొంటూ ఉంటావు. సత్పురుషల సహవాసం ఎందుకంటే సత్పురుషులతో సహవాసం వలన మనలో ఉన్న బలహీనతలు నెమ్మదిగా పల్చబడిపోతాయి అంటే వారి యొక్క వైబ్రేషన్స్ మన మీద పనిచేస్తూ ఉంటాయి. హోలీ కంపెనీ వలన సత్యానుభవం పొందటానికి మనస్సుకు తగిన ప్రిపరేషన్ వస్తుంది, మెచ్యూరిటీ వస్తుంది. ఎవరో వచ్చి నిన్ను ఉద్ధరిస్తారు అని కనిపెట్టుకొని ఉండవద్దు. నీ ప్రయత్నం ఏదో నువ్వు చేసుకో, ప్రయత్నం అవసరం. గౌతమ బుద్ధుడు ఇంకో 5 నిమిషాలలో శరీరం విడిచిపెడుతున్నాడు, అప్పుడు ఆయన సవితి తమ్ముడు ఏమన్నాడు అంటే బుద్ధుడులాంటి వ్యక్తి ఇంతవరకు ఈ భూమి మీదకు రాలేదు అన్నాడు. అటువంటి మాటలకు మనం అయితే సంతోషిస్తాము. మన అహంకారానికి ఫుడ్ అది. ఇది ఎప్పటికయినా దుఃఖంగా మారిపోతుంది. అహంకారాన్ని

తొలగించుకొనే శక్తి మీకు లేకపోయినా కనీసం దానికి ఆహారం అందించటం అయినా తగ్గించుకోవాలి. శరీరం అటు ఇటు తిరగటానికి ఫుడ్ అవసరమే, దానికి తగుమాత్రంగా ఫుడ్ సప్లయిచేయాలి. కాని అహంకారానికి ఫుడ్ సప్లయిచేస్తూ ఉంటే అది పెరిగిపోతుంది, దానివలన ఆరోజు కారోజు దుఃఖం పెరిగిపోతుంది. అందువలన అహంకారానికి ఫుడ్ సప్లయిచెయ్యవద్దు. దైనందిన జీవితంలో జరిగే సంఘటనలకు నీకు సంతోషం వచ్చినా, దుఃఖం వచ్చినా కూడా అహంకారానికి ఫుడ్ సప్లయి అవుతుంది అందుచేతనే పరమాత్మ ఏమని చెప్పాడు అంటే నిందాస్థుతుల మధ్యన, లాభనష్టాల మధ్యన, హెచ్చుతగ్గుల మధ్యన ఏరోజుకారోజు నీ బ్రెయిన్‌ను బేలెన్స్ చేసుకొంటూ ఉండు అని చెప్పాడు. సవితి తమ్ముడు అన్న మాటలకు బుద్ధుడికి ఏమీ పొంగు రాలేదు. స్పిరిట్యువల్ హిస్టరీ నీవు చదివావా అని బుద్ధుడు ఆనంద్‌ను అడిగాడు. నేను చదవలేదు అని చెప్పాడు. హిస్టరీ నీవు చదవకుండా బుద్ధుడిలాంటి గ్రేట్‌మెన్ ఎవడూ రాలేదు అని ఎలా చెపుతున్నావు. ఇటువంటి మాటలు వద్దు. బుద్ధుడు గొప్పవాడు అంటే నీకు కలిసి వచ్చేదేముంది? నీవు బాగుపడే విధానం చూసుకో, నిర్వాణస్థితిని పొందటానికి ప్రయత్నించు అని చెప్పాడు. భగవంతుడు ఒక్కడే, ఇన్ని రూపాలలో కనిపించే వాడు కూడా ఆయనే. నేను మిమ్మల్ని ద్వేషిస్తున్నాను అనుకోండి అంటే నన్ను నేను ద్వేషించుకొంటున్నాను మీకు ఏదైనా అపకారం చేస్తూ ఉంటే నాకు నేనే అపకారం చేసుకొంటున్నాను. ఇది మనకు తెలిస్తే జీవితంలో బహుజాగ్రత్తగా ఉంటాము. ఎందుచేతనంటే నేను మీకు చేసిందే మరల తిరిగి నాకు వస్తుంది. ఇతరులకు నీవు ఏదైనా సహాయం చేస్తే అది తిరిగి నీకే వస్తుంది అని తెలిస్తే నువ్వు సహాయం చెయ్యకుండా ఎలా ఉండగలవు. భక్తుడికి యాక్షన్ ఉంటుంది కాని రియాక్షన్ ఉండదు. వాడు క్వయిట్‌గా ఉంటాడు, కూల్‌గా ఉంటాడు. అతని పని ఏదో అతను చేసుకొంటూ ఉంటాడు. బయట నుండి వచ్చే స్తోత్రాల ప్రభావం, విమర్శల ప్రభావం వాడి మీద ఏమీ పడదు, అది సాధన యొక్క బలం. నువ్వు నేను నేను అంటున్నావు. ఆ నేను అనే తలంపు నీకు లోపల నుండే వస్తోంది. అది ఎక్కడి నుండి వస్తోందో వెదుకు, దానిని ఉపసంహరించు. మూలతలంపు మూలంలోనే సత్యం ఉంది. నీకు ధనం ఉన్నా, గౌరవం ఉన్నా, విద్య ఉన్నా ఎన్ని ఉన్నప్పటికీ సత్యానుభవం కలిగేవరకూ నీకు ఆనందం లేదు. మూలతంపును దాని మూలంలోనికి ఉ పసంహరించి, అక్కడ ఉంచగలిగితే మూలతలంపు నశిస్తుంది, అక్కడ ఉన్న సత్యం నీకు అనుభవంలోనికి వస్తుంది. నీకు నచ్చిన మార్గంలో ప్రయాణం చెయ్యి కాని నీవు

హృదయంలోనికి వెళ్ళాలి. నీవు దేహగతమైన నేనుకే పరిమితమై ఉన్నంతకాలం నీకు ఫ్రీడమ్ లేదు. నీవు ఏ మార్గంలో ప్రయాణం చేసినా దేహగతమైన నేనులో నుండి విడుదల పొందాలి. నీవు దేహగతమైన నేనులోనుండి విడుదల పొందకపోతే శాంతి, ఆనందం నీ హృదయంలోనే ఉన్నా కూడా అవి నీచేతికి అందవు. ఒక వస్తువు నీటిలో పడిపోయినప్పుడు అది ఎంత లోతులలో ఉందో అంత లోతుకు నీవు ములగ గలిగితేనే ఆ వస్తువు నీచేతికి దొరుకుతుంది. అదేవిధంగా నీవు ప్రాణాన్ని బంధించి, మనస్సును నిగ్రహించి, తూకాన్ని పెంచుకొని హృదయం యొక్క లోయలలోనికి వెళ్ళగలిగితేనే అక్కడ ఉన్న సత్యం నీకు అనుభవంలోనికి వస్తుంది లేకపోతే సాధ్యం కాదు. రామకృష్ణుడు ఏమని చెప్పాడు అంటే ఈ ప్రపంచంలో మంచీ ఉంటుంది, చెడ్డా ఉంటుంది. ఇసుక, పంచదార కలిపి అక్కడ పడవేస్తే అక్కడకు చీమలు వస్తాయి. అవి ఇసుకను ముట్టుకోవు, పంచదారను పట్టుకొనిపోతాయి. మనం కూడా అలాగ ఉండాలి. ప్రపంచంలో ఏదో చెడ్డ కనిపిస్తూ ఉంటే ఆ చెడ్డ ఎందుకు ఉంది అని అస్తమాను నీ మనస్సును పాడుచేసుకోవటం మానివేసి ఇసుక, పంచదార కలిపి ఉంటే చీమలు వెళ్ళి ఇసుకను వదిలేసి పంచదారను ఎలా పట్టుకొని వెళ్ళిపోతున్నాయో అలాగ నీవు మంచిని తీసుకొని చెడ్డను వదిలెయ్యి. నిన్ను నీవు తెలుసుకోవటానికి ఈ ప్రపంచాన్ని సహకారంగా తీసుకొని, నిన్ను నీవు పవిత్రం చేసుకొని, నువ్వు ఈ సృష్టిలోనికి ఎందుకు వచ్చావో ఆ పని పూర్తిచేసుకొని బయటకుపో. నువ్వు పుట్టకముందు ఈ ప్రపంచం ఉంది, నీవు చనిపోయాక ఈ ప్రపంచం ఉంటుంది. నువ్వు పుట్టకముందు ఈ ప్రపంచాన్ని ఎవడు చూసాడో, నువ్వు చనిపోయాక కూడా వాడే చూస్తాడు, ఆగోల నీకు ఎందుకు? నీవు నిర్మలంగా ఇక్కడకు వచ్చిన పని చూసుకొని బయటకు వెళ్ళిపో. ఈ ప్రపంచం శాంతిగా ఉండాలి అని చాలామంది అంటారు. మనం లోపల అశాంతితో కాలిపోతూ ఉంటే ప్రపంచంలో శాంతి ఎక్కడ నుండి వస్తుంది. ప్రపంచం అంటే మనమే. నీ లోపల ఉన్నదే బయట కనిపిస్తుంది. నువ్వు ఏ సాధన చేసినా అక్కడ నేను ఉంటుంది. నువ్వు పూజ చేసిన, జపం చేసినా నేనుతోటి చేస్తాము. ముల్లును ముల్లుతోటి తీసేసినట్లుగా ఆ నేనును ఉపయోగించుకొని నేనులోనుండి బయట పడాలి. మతంపేరుమీద, పూజల పేరుమీద, జపాల పేరుమీద వర్క్ కల్చర్‌కు దూరం అవ్వకూడదు. మన శరీరం ఏదో రోజు చనిపోతుంది, ఏదో రోజున చనిపోతుందని చేతిలో ఉన్న పనిని విడిచిపెట్టకూడదు. మనం చేస్తున్న పనిని జాగ్రత్తగా, శ్రద్ధగా చేస్తూ ఉంటే, అందులో నేర్పు మనం చూపించగలిగితే అది కూడా ఒక రకమైన యోగమే. మనకు కర్మఫల కాంక్ష ఎక్కువగా ఉంటుంది. మనలో ఉన్న

మైనస్ పాయింట్ ఏమిటి అంటే కోరిక ఉంటేనే ఆ ఫలితం వస్తుంది. కోరిక లేకపోతే ఏదీ రాదు అనుకొంటాము. అలా కాదు. భగవంతుడు మనకు ఏదైతే కేటాయించాడో మన కోరికతో సంబంధం లేకుండా అది వస్తుంది. భగవంతుడు ఏదైతే మనకు కేటాయించలేదో అది మనం కోరుకొన్నా రాదు. మనకు వచ్చేది ఆగదు, రానిది మనం కోరిక పెట్టుకొన్నా రాదు. ఇది మన మనస్సుకు అర్థమయితే శాంతిగా ఉంటుంది. మతాల గురించి అభిప్రాయ బేధాలు పెట్టుకోవలసిన పనిలేదు. ఉన్న వస్తువు ఒక్కటే. దానినే అనేక మతాలలో అనేక పేర్లతో పిలుస్తున్నారు. స్వర్గరాజ్యం అన్నా మోక్షం అన్నా, నిర్వాణ సుఖం అన్నా, ఇంకా వేరే పేర్లుతో పిలిచినా సత్యం అనేది ఒకటిగానే ఉంది. హృదయంలో ఉన్న సత్యాన్ని అనుభవంలోనికి తెచ్చుకోవటానికి ఇంపర్సనల్ బిహేవియర్ అవసరం. ప్రతీమనిషికి తమోగుణం, రజోగుణం, సత్వగుణం ఉంటాయి. మన మాటలో, ఆలోచనలో, మన ప్రవర్తనలో సత్వగుణాన్ని కల్టివేట్ చేయటం నేర్చుకోవాలి. మూడు విషయాలు అన్ని మతాలు అంగీకరించాయి. మోడరేషన్ ఇన్ ఫుడ్, మోడరేషన్ ఇన్ స్లీప్, మోడరేషన్ ఇన్ వర్డ్. మాటల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. దైనందిన జీవితంలో ఎంతవరకు అసరమో అంతవరకే మాట్లాడాలి, అతిగా మాట్లాడటం వలన కలహాలు పెరుగుతాయి. అతినిద్ర పనికిరాదు, నిద్రలో యుక్తంగా ఉండాలి. ఆహారనియమం అన్నింటికంటే ముఖ్యమైనది. మనకు అవసరమైన దానికంటే ఎక్కువగా తింటూ ఉంటాము. మనిషి అంటే శరీరము, మనస్సు కలిపి మనిషి అంటారు. మనం తినే ఆహారం యొక్క ప్రభావం మనస్సు మీద, శరీరం మీద ఎక్కువగా ఉంటుంది. అందువలన ఫుడ్ విషయంలో మోడరేషన్ అవసరం. ఫుడ్‌లో మోడరేట్‌గా ఉంటే సహనం పెరుగుతుంది, సత్వగుణం పెరుగుతుంది. మనం తినే ఆహారం విషయంలో ఎంత జాగ్రత్తగా ఉంటామో కళ్లతో చూసే విషయాలలో, చెవులతో వినే విషయాలలో కూడా అంత జాగ్రత్తగా ఉండాలి, అది కూడా మనకు ఫుడ్‌తో సమానము. మంచి విను, మంచిని చూడు, మంచిని మాట్లాడు. అవసరం లేని విషయాలలో కలుగజేసుకోవద్దు. ఎందులోను అతిగా ఉండవద్దు. మధ్యే మార్గం మంచిది. ఈ ఆధ్యాత్మికమార్గంలో చిత్తశుద్ధి చాలా ముఖ్యం. నాస్థికుడు కూడా న్యాయాన్ని ధర్మాన్ని అంగీకరిస్తాడు. ధర్మాన్ని ఆచరించటం ఎందుకు అంటే ఆనందం కోసమే, శాంతి కోసమే. ధర్మాన్ని ఆచరించే వాడికి, సత్యాన్ని గౌరవించేవాడికి, వాడికి ఏది అవసరమో అవి అన్నీ సమకూరతాయి అని చెపుతారు. మహాత్ములు చెప్పిన, అవతారపురుషులు చెప్పినా, ఉపనిషత్‌లలో ఋషులు చెప్పినా, ఎవరు ఏమతంలో చెప్పినా మిమ్మల్ని దుఃఖంలేని స్థితికి తీసుకొని వెళ్లటానికే చెపుతున్నారు, ఇందులో రాజీలేదు. మీకు

దుఃఖం వస్తూ ఉంటే వద్దు వద్దు అంటారు. ఎందుచేతనంటే మీ స్వరూపంలో దుఃఖం లేదు. చావు వస్తూ ఉంటే మీరు ఇష్టపడరు ఎందుచేతనంటే చావులేని వస్తువు మన హృదయంలో ఉంది, అది మనమై ఉన్నాము. అన్ని కాలాలలో, అన్ని అవస్థలలో ఈ సృష్టి కనిపించినా కనిపించకపోయినా సత్యం ఒకటి ఉంది. అది అంతటా ఉంది. నీ హృదయంలోను ఉంది. నీ హృదయంలో ఉన్న సత్యాన్ని నీవు తెలుసుకొంటే అంతటా ఉన్న సత్యం నీకు ఎరుకలోనికి వస్తుంది. అప్పుడు నీకు ప్రయాణాలు ఆగిపోతాయి. దేవుడు ఎక్కడ ఉన్నాడు అని భగవాన్‌ను అడిగితే ఆయన ఏమి చెప్పారు అంటే మూలతలంపు మూలంలోనే భగవంతుడు ఉన్నాడు అని చెప్పారు. ఆ మూలతలంపును ఉపసంహరించి దాని మూలంలోనికి పంపగలిగితే అప్పుడు మూలతలంపు నశిస్తుంది, అక్కడ ఉన్న భగవంతుడు నీకు ఎరుకలోనికి వస్తాడు. ఇప్పుడు మనందరికీ ఉండాలి అని ఉందా? చనిపోవాలి అని ఉందా? ఎవరికి చనిపోవాలి అని లేదు, అందరికీ ఉండాలనే ఉంది. ఆ ఉండటమే దేవుడు. ఇప్పుడు మన మనస్సు బ్రెయిన్‌లో ఎంత నార్మల్‌గా, నేచురల్‌గా ఉందో అంత నార్మల్‌గా, నేచురల్‌గా మనస్సు దాని మూలమైన హృదయంలో ఉండగలిగితే ఈశ్వరుడు నీకు ఎరుకలోనికి వస్తాడు. మన లోపల అజ్ఞానం ఉన్నంతకాలం సత్యాన్ని అసత్యం అనుకొంటాము. మంచిని చెడు అనుకొంటాము. ఉన్నది ఉన్నట్లుగా నీకు తెలిసే వరకూ శరీరం కూడా నీడ వచ్చినట్లు ప్రతీ మనిషినీ దుఃఖం వెంటాడుతుంది, అశాంతి వెంటాడుతుంది. ఇప్పుడు మీరు వేరు, నేను వేరు అనుకొంటున్నాము. అక్కడ నుండి ఆందోళన వస్తుంది, భయం కలుగుతుంది. మనందరము ఒక్కటే అనుకొంటాము అనుకోండి, నీకు నాకు బేధం కనిపించటం లేదు అనుకోండి ఇంక ఆందోళన లేదు, భయం లేదు. నన్ను చూసి నాకు భయం కలుగుతుందా? లేదు. మిమ్మల్ని చూస్తే నాకు భయం కలుగుతుంది. మీరు వేరు, నేను వేరు అనుకొంటూ ఉంటే అక్కడ నుండి 90 రకాల ఆలోచనలు వస్తాయి. మీరూ నేను ఒక్కటే అనుకొంటే ఏమీ లేదు. ద్వైతంలోనుండే అల్లరి అంతా వస్తోంది. భగవంతుడి కంటే మనం భిన్నంగా లేము. కాని ఆయనకు భిన్నంగా మనం ఉన్నాము అని అనుకొంటున్నాము, అదే మన అశాంతికి కారణం. మన బంధాలకు, పునర్జన్మలకు, దుఃఖానికి అంతా రూపబుద్ధి, నామబుద్ధే కారణం. ఈ రూపబుద్ధి నుండి నామబుద్ధి నుండి విడుదలపొందితే ఇంక దుఃఖంలేదు, బంధం లేదు, పునర్జన్మ లేదు, ఏమీ లేదు. మనం స్వార్థాన్ని ఒక్కసారే తగ్గించుకోలేము. కొంచెం కొంచెం తగ్గించుకొంటూ ఉంటే ఎంతో కొంత సమాజానికి ఉపయోగపడగలము. మనం భోగాలు కొంచెం తగ్గించు

కొంటే సమాజానికి ఎంతోకొంత ఉపయోగపడతాము. మనం స్వార్థాన్ని తగ్గించుకొంటూ ఉంటే, భోగాలు తగ్గించుకొంటూ ఉంటే ఇక్కడ తృప్తిగా జీవించగలుగుతాము మరణానంతరం మోక్షం కలుగుతుంది. ఈ మధ్య అమెరికాలో ఉన్న పెద్ద ధనవంతులలో ఒకడిని ఒక రిపోర్టరు ప్రశ్న అడిగాడు. మీ ఆదాయంలో 50% మీ కుటుంబానికి ఇస్తున్నారు, 50% సమాజానికి ఉపయోగిస్తున్నారు. అంతా మీరే ఉపయోగించుకోవచ్చుకదా ఎందుకు సమాజానికి ఖర్చుపెడుతున్నారు అని అడిగాడు. ఆయన ఏమి చెప్పారు అంటే ఎవరినో ఉద్ధరించటంకోసం ఇవ్వటం కాదు, అది నాకు తృప్తిని ఇస్తోంది. భగవంతుడు నాకు ఇచ్చినది సమాజంతో షేర్ చేసుకొంటున్నాను. అది నాకు తృప్తిని ఇస్తోంది, ఆనందాన్ని ఇస్తోంది, శాంతిని ఇస్తోంది. నా శాంతికోసం, ఆనందంకోసం ఇది అంతా చేస్తున్నాను కాని దీనివలన ఏదో ఉద్ధరించ బడుతుంది అని నేను చెయ్యటంలేదు. ఏ దేవుడు అయితే ఇచ్చాడో మరల ఆయనకే ఇస్తున్నాను ఇందులో నేను అంటూ ఏమీ లేదు అని చెప్పాడు. నీ దుఃఖానికి కారణం కర్తృత్వ బుద్ధి. కర్తృత్వబుద్ధి అనేది నీ లోపలఉన్న ముడి దానిని మీ తెలివితేటల వలన తీసుకోలేరు. మీరు కొంత ప్రయత్నం చేస్తూ ఉంటే డివైన్ ఇంటర్‌ఫియరెన్స్ వస్తుంది. అప్పుడు ఆముడి తెగిపోతుంది, అప్పుడు ఉన్నది ఉన్నట్లుగా నీకు వ్యక్తమవుతుంది. ఒక రూపాన్ని ధ్యానం చేయటం వలన, నామాన్ని స్మరించటం వలన మనస్సు యొక్క చాపల్యం తగ్గుతుంది. మనోనిగ్రహం కోసమే విగ్రహారాధనను మన పెద్దలు ఏర్పాటుచేసారు. విగ్రహారాధన వలననే సత్యం తెలుస్తుంది అని కాదు దానివలన మనస్సు యొక్క చాపల్యం తగ్గుతుంది. మీరు పూజ చేయండి, జపం చేయండి, ధ్యానం చేయండి. వాటివలన దేహాభిమానం తగ్గాలి. దేహాభిమానం తగ్గుతూ ఉంటే దుఃఖం తగ్గుతుంది. మనం లోకం లోనికి వచ్చాము. భగవంతుడు ఒక్కొక్కరికి ఒకో పనిని కేటాయిస్తాడు. మీ చేతిలో ఉన్న పనిని ఇష్టంగా, ప్రేమగా, భక్తితో చేయండి. ఇలా చేస్తూ ఉంటే పూజతో సంబంధం లేకుండా మీలో ఉన్న పాతవాసనలు పోతాయి, కొత్తవాసనలు రావు. ఎక్కువగా పనిచేయటం వలన మనకు టెన్షన్ రాదు, ఫలితంకోసం ఊహించటం వలన టెన్షన్ వస్తుంది, దాని వలన బిపి పెరుగుతుంది. మనం ఎలా పని చేయాలి అంటే పరీక్షలు వ్రాసేసిన తరువాత చివరిరోజున ఆ స్టూడెంట్ ఎంత టెన్షన్ ఫ్రీగా ఉంటాడో రేపు పరీక్ష అనగా కూడా ఆ స్టూడెంట్ అంత టెన్షన్ ఫ్రీగా ఉండగలిగితే వాడు కరెక్టు స్టేట్‌లో ఉన్నట్లు గుర్తు. మనందరకు ఎంతో కొంత తెలివి ఉంది కాని భగవంతుడు మనకంటే తెలివైనవాడు, మన కంటే బుద్ధి సూక్ష్మత కలవాడు, మనకు ఏది మంచిదో మనకంటే భగవంతుడికి ఎక్కువ తెలుసు, ఆయనకు తెలియకుండా

ఈ సృష్టిలో ఏమీ జరగటం లేదు, ఇవి మీరు గుర్తుపెట్టుకొంటే మీరు టెన్షన్ లేకుండా రోజులు గడిపేస్తారు.

మీరు అందరూ మంచి మంచి ఉద్యోగాలు చేస్తూ ఉండవచ్చు, కోట్లాది రూపాయలు సంపాదిస్తూ ఉండవచ్చు, మీకు సమాజంలో గౌరవం ఉండవచ్చు. ఇవన్నీ మైనస్ పాయింట్లు కాదు, ఇవన్నీ ప్లస్ పాయింట్లే కాని నేను మిమ్మల్ని అందరిని ప్రార్థించేది ఏమిటి అంటే రోజులు అన్నీ మీకు అన్ని విధాలా అనుకూలంగా ఉన్నా ఎట్టి పరిస్థితులలోను అవినయం రాకుండా చూసుకోండి. వినయాల్ని విడిచిపెట్టవద్దు, అణకువను విడిచిపెట్టవద్దు. అణిగి ఉన్న వాడికే ఆత్మజ్ఞానం కలుగుతుంది, లోచూపు ఉన్నవాడికే ఆత్మజ్ఞానం కలుగుతుంది. నీరు పల్లానికి వెళుతుంది కాని మెరకకు వెళ్లదు అలాగే విజ్ఞానం, ఎవడికైతే వినయం ఉందో వాడినే వరిస్తుంది కాని అవినయం ఉన్నవాడిని వరించదు. గీతలో పరమాత్మ ఏమని చెప్పాడు అంటే నా నామాన్ని ఎవరైతే స్మరించుకొంటున్నారో, నేను చెయ్యమన్న పనిని మానకుండా ఎవరైతే చేస్తున్నారో, నేను వద్దని చెప్పిన పనిని ఎవరైతే మానివేస్తున్నారో, నా పాదాలను ఎవరైతే ఆశ్రయిస్తున్నారో వారి యోగ క్షేమాలను నేను చూస్తాను అని పరమాత్మ చెప్పాడు. యోగం అంటే ఉన్నది కాపాడటం, క్షేమం అంటే లేనిది ఇవ్వటం. మీకు బుద్ధి సూక్ష్మత ఉంది అనుకోండి. అది ఈశ్వరుడు ఇస్తే మనకు వచ్చింది, ఈశ్వరుడు ఇవ్వకుండా ఏదీ మనకు రాదు. కొంతమందిలో తెలివితేటలు ఎక్కువగా ఉంటాయి, కొంతమందికి శక్తి ఎక్కువగా ఉంటుంది, కొంతమంది బాగా ఆరోగ్యంగా ఉంటారు, కొంతమంది ఎక్కువగా సమాజానికి ఉపయోగపడుతూ ఉంటారు. అక్కడ ఏదో భగవంతుడి యొక్క వైభవం ఉంది, అది భగవంతుడి ప్రసాదం. మీలో ఏదైనా శక్తి ఉంటే, మీకు బుద్ధిసూక్ష్మత ఉంటే, మీకు ధనం ఉంటే ఇది అంతా నా సొంతం కాదు, దేవుడు ఇస్తే నాకు వచ్చింది అని భావన చేసుకొని మీరు ఎంత వినయంగా ఉంటే అంత భౌతికంగా ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి వస్తారు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 19-11-06, తణుకు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

బి ప్రొ యాక్టివ్, బి పాజిటివ్, బాడీ లాంగ్వేజ్ ఈ మాటలు భౌతికానికి ఉపయోగ పడతాయి. ఆధ్యాత్మికానికి ఉపయోగపడతాయి. చనిపోయిన తరువాత ఉత్తమ లోకాలకు వెళ్లటానికి ఉపయోగపడతాయి. జీవించి ఉండగా సుఖంగా ఎలా జీవించాలో తెలుస్తుంది. ఇవి లౌకిక మాటల కింద అనిపించినా అన్ని మతాల సారం. కొంతమంది లోపల బాగా

ఉండరు, బాగానే ఉన్నామని పైకి చెపుతూఉంటారు. వారు శాంతిగా లేరు అన్న సంగతి వారి శరీరం చెపుతూఉంటుంది. ఒకోసారి మన మనస్సులో లేనిది నటించి చెపుతాము. ఎదుటి వారు నమ్మటం కోసం అలా నటించి చెపుతాము. మన మనస్సు అబద్ధం చెప్పినా శరీరాన్ని చూస్తూఉంటే చెప్పే మాటలు అబద్ధం అని శరీరం చెపుతుంది. కొంతమందికి లోపల ఉపద్రవమైన కోపం ఉంటుంది పైకి శాంతిగా ఉన్నట్లు మాట్లాడతారు. పైకి శాంతిగా మాటలు చెపుతూ ఉన్నా లోపల అశాంతితో కాలిపోతున్నారని శరీరం చెపుతుంది. ఎవరికైనా మన మీద ఇష్టం లేదు అనుకోండి, ఇష్టం ఉన్నట్లు కపటం మాటలు చెపుతున్నారు అనుకోండి, వారి కళ్ళు, నోరు చూస్తూ ఉంటే వారి శరీరం నిజం చెపుతూ ఉంటుంది. దీనినే బాడీ లాంగ్వేజ్ అంటారు. మనం బాడీ లాంగ్వేజ్ కూడా చూసుకొంటూ ఉండాలి. వారు మారిపోవాలి, వీరు మారిపోవాలి అని అనుకోకూడదు. ముందు మన లోపల మార్పు రాకుండా బయట ఏమీ చేయలేము. ఎల్లమ్మ అలా ఉండాలి, పుల్లమ్మ ఇలా ఉండాలి అని నేను అనుకుంటే సరిపోదు. వారు ఎలా ఉండాలి అని నేను అనుకొంటున్నానో నేను అలాగ ఉండటానికి ప్రయత్నం చేయాలి. అలా ప్రయత్నం చేస్తూ వారిని ఉండమని చెపితే ప్రయోజనం ఉంటుంది కాని, మీరు ఏమీ ప్రయత్నం చేయకుండా ఇతరులకు చెపితే ప్రయోజనం లేదు. పరలోకంలో ఏదేవుడయితే ఉన్నాడో ఆ దేవుడే ఈ ప్రకృతిరూపంలో కూడా ఉన్నాడు. కాని అది వేరు, ఇది వేరు అనుకుంటున్నాము, ముక్కలు చేసుకొంటున్నాము, అఖండంగా చూడలేకపోతున్నాము, అక్కడ మనం ఆధ్యాత్మికంగా ఫెయిల్ అవుతున్నాము. అక్కడ ఉన్నవాడే ఇక్కడ ఉన్నాడు, ప్రకృతి రూపంలో భగవంతుడు ఉన్నాడు అని మనం నోటితో చెప్పటం కాదు, అది మనకు అవగాహనకు వస్తే, మన బుద్ధికి పడితే అప్పుడు మన జీవితవిధానంలో మార్పువస్తుంది. నాన్నగారు చెప్పింది బాగుంది అని కొంతమంది, బాగోలేదని కొంతమంది అంటారు అనుకోండి వారి మనస్సుతో నన్ను చూస్తే ఎందుకు బాగుంది, లేకపోతే ఎందుకు బాగాలేదు అనేది తెలుస్తుంది. మీరు ఎన్ని మంచిపనులు చేసినా కొంతమంది సంతోషించరు. వారి మనస్సుతో చూస్తే, వారి కళ్ళతో చూస్తే వారు ఎందుకు సంతోషించటం లేదో తెలుస్తుంది, అప్పుడు మీకు ఉన్న సంతోషం పోదు. బి ప్రొ యాక్టివ్, అందరూ అలా ఉన్నారు, నేను అలా ఎందుకు ఉండకూడదు, అందరూ తమోగుణంలో ఉన్నారు, నేను తమోగుణంలో ఎందుకు ఉండకూడదు అలా అనుకోవద్దు. ఇతరులు ఎలాగ ఉండాలి అని నీవు అనుకొంటున్నావో నీవు అలాగ ఉండటానికి ప్రయత్నం చెయ్యి. నీలో మార్పు

తెచ్చుకోవటానికి ప్రయత్నం చెయ్యి. నీలో మార్పు లేకుండా ఇతరులలో ఏమీ మార్పు తీసుకొని రాలేవు, అలా మార్పు తీసుకొని రావటానికి ప్రయత్నం చేసినా ఫెయిల్ అవుతావు. మనకు ఆత్మజ్ఞానం కలగాలంటే దేహం సహకరించాలి, ఇంద్రియాలు సహకరించాలి, మనస్సు సహకరించాలి. అవి సహకరించకపోతే మనం సక్సెస్ అవ్వలేము. తాబేలును చూడండి చిన్నచప్పుడు అయింది అనుకోండి, దానికి ప్రమాదం వస్తోంది అనుకోండి ఇంద్రియాలను లోపలకు లాగేసుకొంటుంది. మనం ఆత్మజ్ఞాన సముపార్జనకు ప్రయత్నం చేస్తూ ఉంటే తాబేలు ఇంద్రియాలను లోపలకు లాగేసుకొన్నట్లు మన మనస్సు, ఇంద్రియాలు లోపలకు ఉపసంహరింపబడి హృదయంలో ఐక్యమైతే అప్పడు ఆత్మసాక్షాత్కారం కలుగుతుంది, ఇంక మనం శవాలను మోయవలసిన పనిలేదు. మనం ఎవరికైనా ఒకమాట చెపుతాము అనుకోండి. వారు బాగా లేదు అంటే ఎందుకు బాగాలేదు అంటున్నారు, వారికి అర్థం అవ్వక అలా అంటున్నారా, ఇష్టం లేక అంటున్నారా అని వారి మనస్సుతో మనం చూస్తే మనకు తెలుస్తుంది. వారికి అర్థంకాక బాగాలేదు అంటే ఇంకా వివరంగా చెప్పవచ్చు, ఇష్టం లేక బాగాలేదు అంటే వారిని అక్కడితో వదిలేయాలి, చర్చపొడిగించవద్దు, వారి స్నేహం తగ్గించుకోండి. మా మనస్సు కుదురుగాలేదు, బాగాలేదు అంటారు దానికి కారణం రాగద్వేషాలు. మనకు ఇష్టమైనవారు అందరూ మనకు ఉపకారం చేస్తారు అనుకోనక్కరలేదు. సాధ్యమైనంతవరకు మనంతట మనం అభివృద్ధిలోనికి రావటానికి ప్రయత్నం చేయాలి. ఇతరుల మీద ఆధారపడితే బానిసత్వం వస్తుంది. భగవంతుడు చెప్పినమాట శాసనం. భగవంతుడు చెప్పిన మాటను ప్రమాణంగా పెట్టుకొని జీవించాలి కాని వారు అలా అన్నారు, వీరు ఇలా అన్నారు అని అనుకోవద్దు. ఇతరుల గొడవ వద్దు, నీ విశ్వాసాన్ని కాపాడుకో, ఇతరుల గొడవలలో ఉంటే నీవు గమ్యానికి వెళ్ళలేవు, ఫెయిల్ అవుతావు. పాజిటివ్‌గా ఉండు. వివేకానందకు అంత ప్రాముఖ్యత రావటానికి కారణం జీవితంలో ప్రతీ సంఘటనను పాజిటివ్‌గా తీసుకొనేవాడు. కొంతమంది ప్రతీదీ నెగిటివ్‌గా తీసుకొంటారు, మనం మంచి చెప్పినా చెడ్డగా తీసుకొంటారు. చివరకు వారు పాడైపోతారు, ఇతరులను పాడుచేస్తారు. నెగిటివ్ తింకింగ్ ఉన్న వారితో సహవాసం పనికిరాదు. దాని వలన ప్రమాదం ఏమిటి అంటే సమాజంలో భావకాలుష్యం తీసుకొని వస్తారు, ఎదుటివారి భావాలు మంచివి అయినా వాటిని చెడగొడతారు. వాతావరణకాలుష్యం కంటే భావకాలుష్యం చాలా చెడ్డది. వాతావరణకాలుష్యం వలన మనకు అనారోగ్యం రావచ్చు. భావకాలుష్యం వలన మనస్సే

కుళ్ళిపోతుంది. మన మనస్సును పాడుచేసే వారు ఎవరైనా వస్తూఉంటే ముందుగానే మనం బయటకు పోవటం మంచిది. ఎందుచేతనంటే మనం సంపాదించు కొన్నది చెడగొడతారు. ఆత్మజ్ఞానసముపార్జనకు మనస్సు సహకరించాలి, ఇంద్రియాలు సహకరించాలి, దేహం సహకరించాలి, బుద్ధి సూక్ష్మంగా ఉండాలి, ఎదుటివారు చెప్పేది అర్థం చేసుకొనే శక్తి ఉండాలి, ఇన్ని రకాలుగా అన్నీ సహకరిస్తేనేగాని ఆత్మజ్ఞానం రాదు. మన ఆలోచనలను పాడుచేసుకోవద్దు. ఎందుచేతనంటే మనకు వచ్చే ప్రతీ తలంపుకు, ప్రతీ భావనకు మనం యమధర్మరాజు కోర్టులో సమాధానం చెప్పవలసి ఉంటుంది. మనకు ఏదైనా చెడుతలంపు వచ్చింది అనుకోండి, అది మనం మర్చిపోయినా యమధర్మరాజుకి సమాధానం చెప్పాలి. ఈ మధ్య ఉత్తరప్రదేశ్‌లో జరిగిన సంఘటన చెపుతున్నాను. అక్కడ ఒక ఊరులో రెండు కుటుంబాల మధ్య పొలానికి వెళ్ళే దారిలో పేచీ వచ్చింది. దాని విలువ 50వేల కంటే ఉండదు. దాని గురించి గొడవపడి కాల్చుకొని రెండు కుటుంబాలలో 16 మంది చనిపోయారు. ఈ పేచీ గురించి పెద్దల దగ్గరకు వెళ్ళరు. నేను ఎందుకు వెళ్ళాలి అంటే నేను ఎందుకు వెళ్ళాలి అని పేచీ పెంచుకొని కాల్చుకుని చనిపోయారు, నూటికి నూరు పాళ్ళు అహంకారం పెట్టుకొని చంపుకొన్నారు. అక్కడ అలా జరిగింది అనికాదు, ఇక్కడ మనకు అయినా ఇంట్లో సమస్యలు అయినా, అత్తాకోడలు మధ్య పేచీలు అయినా ఏమి ఉంది అని చూస్తే ఏమీ కనబడదు. అన్ని సమస్యలకు, పేచీలకు అహంకారమే కారణం. ఏమీ లేదు అత్తగారు అక్కడ కూర్చొంది అనుకోండి, కోడలు తెచ్చి ఎవరికైనా పది రూపాయలు ఇస్తే నేను పెద్దదానిని నాతో ఇప్పించవచ్చుకదా లేకపోతే నాతో చెప్పి ఇవ్వవచ్చు కదా అని అత్తగారు అనుకొంటుంది. ఆమాత్రం నాకు స్వాతంత్ర్యం లేదా అని కోడలు అనుకొంటుంది. అక్కడ అహంకారం ఊరుకోనివ్వదు. ఇద్దరి అహంకారాలు కలిసి కొంపకు నిప్పు పెట్టేస్తాయి. భౌతికంగా ఏదైనా నష్టం వస్తే ఇబ్బంది పడినా పరవాలేదు, భౌతికంగా నష్టం రాకపోయినా అహంకారంతో పేచీలు పెట్టుకొంటున్నారు. అవగాహన లేకపోవటం వలన, సజ్జనసాంగత్యం లేకపోవటం వలన ఇలా జరుగుతోంది. మనగురించి విమర్శించేవారు ఉంటారు, పొగిడే వారు ఉంటారు. ఈ రెండింటిని లోపలకు తీసుకొంటే వికారాలు ప్రారంభమవుతాయి. మనం ఎప్పడూ శాంతిగా ఉండాలి, మనం మనంగా ఉండాలి. ఎవరైనా పొగిడితే పొంగి పోకూడదు. ఎవరైనా విమర్శిస్తే కృంగిపోకూడదు. నేను ఎవడను అనే ప్రశ్నకు సమాధానం ఎవరంటే నేనే ఆ ప్రశ్నకు సమాధానం. నేను ఏదిగా ఉన్నాను ఆత్మగా ఉన్నాను. కాని ఏ

శరీరం అయితే నేను కాదో, ఏ మనస్సు అయితే నేను కాదో దానితో కలిసి ఉంటున్నాను. నువ్వు కానిదానిని నువ్వు అనుకొంటున్నావు. నువ్వు ఏదిగా ఉన్నావో అందులో ఐక్యమవ్వటానికే నేను ఎవడను అనే ప్రశ్న వచ్చింది. ఆత్మజ్ఞానం కలిగే వరకూ ఈ ప్రశ్న వేసుకొంటూ ఉండవలసిందే. మనం ఏదైతే కాదో దానినే అస్తమానూ జ్ఞాపకం పెట్టుకొంటున్నాము. ఏదైతే మనమో దాని గురించి ఎవరైనా చెప్పినా వినము, దానిని మననం చేయము. కాని గొడవలు అన్నీ మీద పెట్టుకొంటున్నాము, మనం ఏదిగా ఉన్నామో దానిని మర్చిపోతున్నాము. మనం ఏదిగా ఉన్నామో దాని తాలుక ఎరుక కలిగించటానికే నేను ఎవడను అనే ప్రశ్న. మీరు శాంతిగా ఉండండి, ఏవో కల్పించుకొని దుఃఖపడవద్దు. మీ అమ్మాయికి అనారోగ్యం వచ్చింది అనుకోండి, అయ్యబాబోయ్ నాకు వచ్చేసింది అని ఏడవటం, మీ అమ్మాయికి అనారోగ్యం వస్తే వైద్యం చేయించవచ్చు అంతే గాని మీకే వచ్చినట్లు ఏడవటం ఎందుకు? మీ ఇంట్లో ఎవరికైనా దుఃఖం వస్తే వారు రూపాయికి పది పైసలు ఏడుస్తూ ఉంటే, మీరు రూపాయికి 50 పైసలు ఏడవటం, మీ ఇంట్లో ఎవరైనా చనిపోతే గోలగోల, ప్రక్కింటిలో ఎవరైనా చనిపోతే మీకు ఏమీ అనిపించదు. ఇదేమి గోల అంటున్నాడు పరమాత్మ. ఈ రకమైన గోల వలన మీకు తెలియకుండా మమకారం పెరుగుతుంది. ఒకవేళ మీకు సంతోషం వచ్చినా, దుఃఖం వచ్చినా అది అహంకారానికే ఇది మీరు గుర్తుపెట్టుకోండి. ఈ దుఃఖానికి, సంతోషానికి అతీతంగా చైతన్యం ఉంది. బుద్ధుడి దగ్గరకు ఒక అమ్మగారు వచ్చారు. మా ఆయన చనిపోయారు దుఃఖం వచ్చేస్తోంది అని చెప్పింది. ఈగ్రామంలో చాలా ఇల్లులు ఉన్నాయికదా, అందరి ఇంటికి వెళ్ళి మీ ఇంట్లో చనిపోయిన వారు ఎవరైనా ఉన్నారా అని అడిగిరమ్మని చెప్పాడు. అందరి ఇంటికి వెళ్ళింది, ప్రతీ ఇంటిలోను ఏదో ఒక చావు కబురు చెప్పారు. అప్పుడు బుద్ధుడు చెప్పాడు అమ్మా! మనిషి చావటానికే పుడతాడు, కలకాలం ఉండటానికి కాదు. మన కళ్ళ ఎదురుగా ఎవరైనా చనిపోతున్నా మనకు ఏమీ ఇబ్బంది లేదు అనుకొంటాము అదే మాయ. ఎవరింటి దగ్గర లేని బాధ నీకు వస్తే చెప్పు. అందరి ఇంటి దగ్గర చనిపోతున్నారు అలాగే మీ ఇంటిలోను చనిపోయారు. అది సహజం, దీని గురించి ఎందుకు దుఃఖపడతావు అని చెప్పాడు. ఈ శరీరానికి ఏదో రోజు చావు వస్తుంది. ఈ లోపుగా మన శరీరాన్ని, మనస్సును, ఇంద్రియాలను జాగ్రత్తగా ఉపయోగించుకొని ఆత్మజ్ఞానం పొందటానికి ప్రయత్నం చెయ్యి, అదే మన జీవిత గమ్యం. అయితే మనం ఎలాగ ఉండాలి అంటే ఇప్పుడు మనం హైదరాబాద్ వెళదాము అనుకొన్నాము అనుకోండి, హైదరాబాద్

ఎవరో ఒకరి ఇంటికి చేరిన తరువాత అమ్మయ్య వచ్చేసాను అనుకొంటాము, హేపీగా ఫీలవుతాము. హైదరాబాద్ చేరిన తరువాత నీవు ఎంత సంతోషంగా ఉంటున్నావో, నీవు ప్రయాణం చేసేటప్పడు కూడా అంత సంతోషంగా ఉండాలి. గమ్యానికి చేరిన తరువాత నీవు ఎంత హేపీగా ఉంటావో ప్రయాణంలో కూడా అంత హేపీగా ఉండాలి. అది నీవు నేర్చుకోవాలి. సాధన చేసేటప్పడు కూడా ఈ సాధన ఎప్పడు అయిపోతుంది అని అనుకోకూడదు. దేవుడి దర్శనం అయినప్పడు ఎలాగ ఉంటామో ఆయన కోసం చేసే సాధనలో కూడా అంత సంతోషంగా ఉండాలి. దీనికి మన బుద్ధి సహకరించాలి, శారీరక ఆరోగ్యం కాపాడుకోవాలి. మనస్సును నిర్మలంగా ఉంచుకోవాలి, వైరాగ్యం పెంచుకోవాలి వీటి అన్నింటిని సమన్వయం చేసుకొంటే అప్పడు మనకు బ్రాహ్మీస్థితి కలుగుతుంది. గురువు ఎంత ఉత్తముడో శిష్యులు కూడా అంత ఉత్తములు అయితే బ్రహ్మజ్ఞానం పొందటానికి అర్హత కలుగుతుంది. గురువు మనలను ఎంతగా ప్రేమిస్తున్నాడో మనం కూడా గురువును అంతగా ప్రేమించాలి. మన పూర్వీకులు మన గురించి ఎలా ఆలోచించారో ఇప్పడు మనం కూడా వెనుక వచ్చే జనరేషన్ గురించి ఎంతో కొంత ఆలోచించాలి. దక్షిణేశ్వరంలో రాణిరాచమణి ఒక దుర్గ గుడి కట్టించింది. ఆమెకు వచ్చిన సత్ సంకల్పం నుండి అనేక ఘనకార్యాలు జరిగాయి. ఆ సత్ సంకల్పం నుండి రామకృష్ణుడు వచ్చాడు, వివేకానందుడు వచ్చాడు, రామకృష్ణ మఠం వచ్చింది, ఆ మఠం ద్వారా సమాజానికి ఉపయోగపడే పనులు అనేకం జరుగుతున్నాయి. ఇదంతా రాచమణి సంకల్పంలో నుండి వచ్చింది. మీరు ఏదైనా మంచి పని చేసారు అనుకోండి, మీ శరీరం పడిపోయినా మంచి అలా సాగుతూ ఉంటుంది. మీ ఇంట్లో వారికోసం, గొప్పలకోసం బిందెల కొలది నీరు వచ్చేలాగ ఏడుస్తున్నారు కాని భగవంతుడు కోసం ఒక కప్ప నీరు వచ్చేలాగైనా ఎప్పడైనా ఏడ్చారా? మీరు జ్వరంతో బాధపడుతూ ఉంటే పాయసం తియ్యగా ఉండదు, చేదుగా ఉంటుంది. అలాగే మీరు ప్రాపంచిక జ్వరంతో బాధపడుతూ ఉంటే భగవంతుడు చెప్పిన మాటలు తియ్యగా ఉండవు, చేదుగా ఉంటాయి. మీకు పుణ్యబలం లేకపోతే, వివేకం లేకపోతే సజ్జనసాంగత్యం చెయ్యాలని అనిపించదు. మన ప్రేమలు వ్యాపార ప్రేమలు, ఒక్కమాట మంచి మాట ఉండదు, అన్నీ వ్యాపారం మాటలే. జీవితం అంతా వ్యాపారమే. ఈ వ్యాపార సంస్కృతిలో నుండి మహాత్ములు రావటం కష్టం. కొంతమంది మనుషులు ఎలాగ ఉంటారు అంటే వారి కొంప అంటుకొంది, అందులో నలుగురు చనిపోయారు అంటే మా బాగా జరిగింది అనేవారు ఉన్నారు. అటువంటి


వారితో స్నేహాలు వద్దు. పాజిటివ్ తింకింగ్ ఉన్నవారితో స్నేహం చెయ్యండి. ఈశ్వరుని పాదాలు విడిచిపెట్టవద్దు. నాకు ఇంకా మోక్షం రాలేదు ఏమిటి అని కంగారు పడవద్దు. ఓర్పు అవసరం. భగవాన్ ఒక మాట చెప్పారు. చేపలు పట్టేవాడు గేలం వేస్తాడు, గేలానికి మాంసపు ముక్క పెడతాడు. వాడు మనతో మాట్లాడుతూ ఉన్నా వాడి మనస్సు గేలం మీద ఉంటుంది. చేప ఆ మాంసపు ముక్క దగ్గరకు వస్తుంది, గంట ఆలస్యం అవ్వవచ్చు, రెండు గంటలు ఆలస్యం అవ్వవచ్చు, వాడు ఏకాగ్రంగా ఉంటాడు. ఇంకా చేపరాలేదు ఏమిటి అని కంగారు పడడు. చేప వచ్చేవరకు గేలాన్ని అలాగే పట్టుకొని ఉంటాడు. చేప వచ్చి మాంసపు ముక్కను పట్టుకోగానే బయటకు లాగేస్తాడు. ఈలోపు కంగారుపడి గేలాన్ని తీసేస్తే చేప వాడికి దొరకదు. మీరు మోక్షంకోసం కంగారు పడవద్దు మీ బుద్ధి పక్వం అయినప్పుడు, హృదయం విశాలం అయినప్పుడు, భేదబుద్ధి రాలిపోయినప్పుడు మీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. గురువు బయట చేసేది తక్కువ ఉంటుంది, లోపల చేసేది ఎక్కువ ఉంటుంది. గురువు ఏమి చేస్తాడు అంటే ఈ సుబ్బమ్మ నాకోసం తపిస్తోంది, రామరామ అంటోంది, రాముడిని తెలుసుకోలేకపోతోంది, రాముడిని తెలుసుకోవటానికి ఆవిడకు లోపల ఏమి అడ్డు వస్తున్నాయి అని చూసి వాటిని నెమ్మదిగా తొలగిస్తాడు, బయట ఏమీ గొడవ చేయడు, చేసే పని లోపల చేస్తాడు, వాడు గురువు. ఆయనకు గుర్తింపు అక్కరలేదు. మీ అమ్మాయికి రవికలగుడ్డ ఇచ్చి నన్ను గుర్తించటం లేదు అని మీరు అనుకొంటారు, ఇచ్చిందిలే రవికలగుడ్డ అని మీ అమ్మాయి అనుకొంటుంది. మీకు దేవుడు అక్కరలేదు, మీ అమ్మాయికి దేవుడు అక్కరలేదు, ఎవరిగోల వారిది, ఇదంతా వ్యాపారం. మంచి అలవాట్లు, చెడ్డ అలవాట్లు కూడా అలవాట్లే. చెడ్డ అలవాట్లు ఉన్నవారికి ఆ అలవాట్లు వలన ఎలా పాడైపోతారో వారికి అర్థమయ్యేలాగ చెపితే అందులోనుండి బయటకు వచ్చేస్తారు. మనం ఆత్మజ్ఞానం సంపాదిస్తే ఈ శరీరానికి, మనస్సుకు, ఈ అలవాట్లకు, ద్వైతానికి, పంచభూతాలకు అతీతంగా వెళ్ళిపోయి ఒక ముద్ద అయిపోతాము. మీ శరీరం అందంగా ఉండాలని అందరూ అనుకొంటున్నారు. మీ శరీరం ఎంత అందంగా ఉండాలని అనుకొంటున్నారో అలాగ మీ మనస్సు, మీ హృదయం కూడా అంత అందంగా ఉండాలనే భావనతో సాధన చెయ్యండి. మీరు ఇంటి దగ్గర కూర్చొని కాలక్షేపం మాటలు చెప్పకోవద్దు. భగవంతుడు చెప్పిన మాటలను చెప్పకొంటూ వాటిని మననం చేసుకొంటూ, వాటిని ఎంజాయ్ చెయ్యండి. వీరు నా మాటలు చెప్పకొంటూ ఎంత బాగా ఎంజాయ్ చేస్తున్నారు అని భగవంతుడు పొంగిపోయి ఆయన చేతులతో మీకు జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 12-12-06 | మంగళ | శ్రీరమణ క్షేత్రం, జిన్నూరు |
| 17-12-06 | ఆది | ఎపి స్పెషల్ పోలీస్ క్వార్టర్స్ కళ్యాణ మండపం, కాకినాడ |
| 01-01-07 | సోమ | క్షత్రియ కళ్యాణ మండపం, పాలకొల్లు |
| 04-01-07 | గురు | శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు (భగవాన్ జయంతి) |
| 11-01-07 | గురు | నవగ్రహ యాగం సందర్భంగా గుమ్ములూరు కళ్యాణ మండపం |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**


**- Mahabharatha**



# జిన్నూరు శ్రీ రమణక్షేత్రంలో భగవాన్ శ్రీ రమణ మహర్షి 127వ జయంతి మహోత్సవములు

## 04-01-2007 గురువారం

| | |
|---|---|
| ఉ॥ గం॥ 6-00ల నుండి | **సద్గురు దర్శనం** |
| ఉ॥ గం॥ 8-00ల నుండి | **భగవాన్ పూజ శ్రీ రమణక్షేత్రంలో** |
| ఉ॥ గం॥ 10-00ల నుండి<br>మ॥ గం॥ 12-00ల వరకు | **ప్రసాద వినియోగం** |
| మ॥ గం॥ 12-00లకు | **శ్రీ నాన్నగారు ఆశ్రమమునకు రాక** |
| మ॥ గం॥ 2-00లకు | **సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు** |



కువైట్‌లో భక్తులతో సద్గురు శ్రీ నాన్నగారు



కత్తార్‌లో భక్తులతో సద్గురు శ్రీ నాన్నగారు